తిరుపతి మన రాజధాని

చింత తగ్గని నినాదం



అమరావతా.. విశాఖా? ఏదీ తేలకుండానే ఐదేళ్ల గడిచిపోయాయి. జగన్‌రెడ్డి పుణ్యమా అని రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ దేశంలో ఎగతాళికి గురవుతోంది. మూడు రాజధానుల పాచిక ఈ ఎన్నికల్లో పారదని తెలిశాక జగన్‌రెడ్డి నోట కూడా ఆ మాట వినిపించడం లేదు. అయితే మాజీ ఎంపీ చింతామోహన్ మాత్రం 'తిరుపతి మన రాజధాని' అంటూ బ్యానర్ పట్టుకుని ఊరూరూ తిరుగుతున్నారు. 2021 ఉప ఎన్నికల సమయంలో ఆయన నోట వినిపించిన ఈ నినాదం ఇప్పుడు మళ్లీ ప్రచారాంశంగా మారింది. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్న ఆయన, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందనీ, అప్పుడు తిరుపతిని రాజధానిగా చేస్తామని ధాటీగా చెబుతున్నారు. మద్రాసు నుంచి ఆంధ్ర విభజన జరిగిన సమయంలో ఆచార్య ఎన్‌జీ రంగా తిరుపతిని రాజధాని నగరంగా చేయాలని అడిగారని, అయితే నీలం సంజీవరెడ్డి మాటలు విని జవహర్‌లాల్ నెహ్రూ కర్నూలును రాజధాని చేశారని ఆయన చరిత్రను కూడా ప్రజలకు వివరిస్తున్నారు. రాష్ట్ర విభజన సమయంలో తిరుపతిని రాజధాని చేయాలంటూ నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ఎంపీ హోదాలో తాను రాసిన లేఖనూ, దానికి మన్మోహన్ సానుకూల స్పందననూ కూడా ఆయన సాక్ష్యంగా చూపిస్తున్నారు. ఆలూ లేదు చూలూ లేదు.. నడిమధ్యలో తిరుపతి కతేందబ్బా! అని కొందరు అనుకుంటున్నా.. చింతామోహన్ మాత్రం రాజధాని నినాదాన్ని మరింత బలంగా వినిపిస్తున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

సత్యవేడుతో ఆటాడుకుంటున్నారా?



వైసీపీ తీరుపై ఎస్సీల్లో రగులుతున్న అసంతృప్తి

వైసీపీకి సత్యవేడు నియోజకవర్గం ఆటస్థలంగా మారిపోయిందనే వ్యాఖ్యలు ఆ పార్టీలోనే వినిపిస్తున్నాయి. ఇప్పటికే రెండుసార్లు అభ్యర్థుల పేర్లు మారాయి. ఆదిమూలం గ్రాఫ్ బాగాలేదని తిరుపతి ఎంపీ గురుమూర్తిని తెచ్చిపెట్టారు. అసంతృప్తిని అణచుకుని ఆయన మండలాల్లో తిరిగి నాయకులను కూడేసుకున్నారు. ఆదిమూలం పార్టీ తీరుపై నిరసన వ్యక్తం చేయగానే, తిరుపతి ఎంపీ సీటు కూడా ఆయనకు తూచ్ అనేశారు. గురుమూర్తిని మళ్లీ తిరుపతి స్థానానికే అని ప్రకటించిన పార్టీ పెద్దలు, స్థానిక నేతలు ఎవ్వరితోనూ సంప్రదించకుండానే సత్యవేడుకి నూకతోటి రాజేష్ పేరును ప్రకటించారు. వైసీపీ కేడర్‌లో ఇది మరింత చికాకును పెంచింది. స్థానికంగా ఎవరూ లేరా? జీడీ నెల్లూరు నుంచి తెచ్చి మా నెత్తిన పెట్టాలా? అని రుసరుసలాడుతున్నారు. సోషల్ మీడియాలో ఈ అసంతృప్త పోస్టులు కుప్పలుతెప్పలుగా కనిపిస్తూ ఉన్నాయి. వైసీపీ నాయకులు, కార్యకర్తలు, రిటైర్డ్ ఉద్యోగులు, వలంటీర్లు కూడా స్థానికేతరులకి టికెట్ ఎందుకు అనే ప్రశ్న సంధిస్తున్నారు. టికెట్ దొరికిందనే సంబరంలో ఉన్న నూకతోటి రాజేష్‌కి దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. అభ్యర్థి అని ప్రకటించినా ఆయన ఇంతదాకా నియోజకవర్గంలో అడుగు పెట్టనేలేదు. మర్యాదపూర్వకంగా కూడా స్థానిక నేతలను కలుసుకోనే లేదు. ఇటువంటి వాతావరణంలో కోట్లు ఖర్చుపెట్టి పోటీచేసేందుకు ఆయన జంకుతున్నారనే ప్రచారం జరుగుతోంది. పరిస్థితి చూసి అధిష్ఠానం మరో కొత్త వ్యక్తి పేరును సత్యవేడు నుంచి ప్రకటిస్తారని కూడా చెప్పుకుంటున్నారు. ఏమైనా... దళిత నియోజకవర్గాలతోనే వైసీపీ ఈ ఆటలన్నీ ఆడుతోందనే ఆగ్రహం ఎస్సీల్లో చాపకింద నిప్పులా రగులుతోంది.

- సత్యవేడు

పంచాయతీ కార్యాలయంలో వైసీపీ సమావేశాలా?

నారాయణవనం, ఫిబ్రవరి 5: సత్యవేడు వైసీపీ ఎమ్మెల్యే ఆదిమూలం వ్యవహారం తర్వాత నియోజకవర్గంలో ఆశావహులు పెరిగిపోయారు. టికెట్ కోసం పెద్ద ఎత్తున పావులు కదుపుతున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఇటువంటి నేతల్లో కొందరు సోమవారం ఉదయం నారాయణవనం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో పార్టీ సమావేశాలు నిర్వహించడంపై విమర్శలొస్తున్నాయి. పంచాయతీ కార్యాలయంలో పార్టీ సమావేశాలు నిర్వహించడం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



పంచాయతీ కార్యాలయంలో సమావేశమైన వైసీపీ నాయకులు

'రా.. కదలిరా' సభకు సర్వం సిద్ధం

- లక్ష నుంచి లక్షన్నర మంది హాజరవుతారని అంచనా
- నేడు జీడీనెల్లూరుకు రానున్న చంద్రబాబు నాయుడు



హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న నాయకులు

చిత్తూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలోని జీడీనెల్లూరు సమీపం రామానాయుడుపల్లెలో మంగళవారం మధ్యాహ్నం జరిగే 'రా.. కదలిరా' బహిరంగ సభకు సర్వం సిద్ధం చేశారు. సభా వేదిక, హెలిప్యాడ్‌ను సిద్ధం చేయగా, ప్రాంగణం ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొనే ఈ సభకు సంబంధించి జిల్లా టీడీపీ నాయకులు వారం రోజులుగా ఇక్కడ ఏర్పాట్లను దగ్గరుండి పూర్తిచేశారు. సోమవారం నుంచే నాయకులు, కార్యకర్తల సందడితో సభాప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. మాజీ మంత్రి అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పార్లమెంటు అధ్యక్షుడు పులివర్తి నాని, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, నియోజకవర్గ ఇన్‌చార్జి థామస్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టిబాబు నాయుడు తదితరులు సోమవారం సభాప్రాంగణాన్ని, హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. ఏ నియోజకవర్గం నుంచి ఎంతమంది, ఎవరి ఆధ్వర్యంలో సభకు హాజరవ్వాలనే ప్రణాళికను ఆయా ఇన్‌చార్జులు పూర్తి చేశారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలనుంచి లక్షన్నర మంది హాజరయ్యేలా ప్లాన్ చేసుకున్నారు. కనీసం లక్ష మందికి తగ్గకుండా వస్తారని భావిస్తున్నారు. జీడీనెల్లూరు నియోజకవర్గం నుంచి 40 వేల మంది, పూతలపట్టు, చిత్తూరునుంచి 20వేల చొప్పున, పలమనేరు, చంద్రగిరి, నగరి నుంచి 10 వేల చొప్పున, కుప్పం నుంచి 5 వేల మంది హాజరవుతారని నాయకుల అంచనా. లక్షన్నర మందికి అవసరమైన ఏర్పాట్లను సభా ప్రాంగణం వద్ద సిద్ధం చేశారు. ఇక్కడికి ఆయా నియోజకవర్గాల నుంచి హాజరయ్యేవారికి వారి మండల నాయకులు భోజనాలను ప్యాకింగ్ చేసి వాహనాల్లో అందించేలా చూసుకున్నారు. గ్రామాలు, మండలాలు, నియోజకవర్గాల వారీగా నాయకులకు శ్రేణుల్ని తరలించే బాధ్యతను అప్పగించారు.



సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లు

చిత్తూరు నుంచి 4 వేల స్కూటర్లతో ర్యాలీ

చిత్తూరు నియోజకవర్గం నుంచి 4 వేల స్కూటర్లతో జీడీనెల్లూరు వరకు టీడీపీ శ్రేణులు ర్యాలీ నిర్వహించనున్నారు. అలాగే 80 బస్సులు, 150 ప్యాసింజర్ ఆటోలు, 80 సుమోలను సిద్ధం చేసుకున్నారు. ఈ మేరకు చిత్తూరు నగరం, గుడిపాల, చిత్తూరు మండలాల్లో స్థానిక నాయకులకు తరలింపు బాధ్యతల్ని అప్పగించారు. చిత్తూరు నియోజకవర్గ శ్రేణులకు నగర శివారు ఠాణా వద్ద భోజనాలను ఏర్పాటు చేశారు.

సభను విజయవంతం చేయండి

చిత్తూరు సిటీ: రా.. కదలిరా బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ అధ్యక్షుడు పులివర్తి నాని, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, నేతలు చంద్రప్రకాష్, కఠారి హేమలత, గురజాల జగన్మోహన్, సీఆర్ రాజన్, కాజూరు బాలాజీ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ దిశగా రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, డివిజన్, వార్డు స్థాయి నాయకులందరూ కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు.

ఒంటి గంట నుంచే నేతల ప్రసంగాలు!

వెదురుకుప్పం: టీడీపీ చేపట్టిన 'రా.. కదలిరా' బహిరంగ సభలో మంగళవారం మధ్యాహ్నం నుంచే జిల్లా నేతల ప్రసంగాలు మొదలయ్యే అవకాశాలున్నాయి. ఈ సభలో పాల్గొనేందుకు చంద్రబాబు నాయుడు మధ్యాహ్నం 3 గంటలకు వేదిక వద్దకు చేరుకుంటారు. 4.30 గంటల వరకు జరిగే సభలో పాల్గొని తిరుగు ప్రయాణమవుతారు. ఈ క్రమంలో చంద్రబాబు వచ్చేలోగానే హాజరైన ప్రజలను ఉద్దేశించి ప్రముఖ నాయకులు ప్రసంగిస్తారు.



రాహు కేతు పూజల్లో రష్యన్ భక్తులు

శ్రీకాళహస్తీశ్వరుడి సేవలో రష్యన్లు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 5: శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని సోమవారం రష్యాకు చెందిన 30మంది భక్తులు దర్శించుకున్నారు. ఆలయంలోని రూ.750 రాహు-కేతు సర్ప దోష నివారణ పూజలు జరిపించుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితుల నుంచి ఆశీర్వాదం పొందారు. అనంతరం ఆలయంలోని ఊంజలసేవ మండపం వద్ద శివనామస్మరణ చేశారు. ఆలయ శిల్ప సౌందర్యం విదేశీ భక్తులను ఆకట్టుకుంది.

మార్చిలోపు ఐఐటీ, ఐసర్‌లో పెండింగ్ పనులను పూర్తి: కలెక్టర్



తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 5: కేంద్ర విద్యా సంస్థలు ఐఐటీ, ఐషర్‌లో పెండింగ్ పనులను మార్చి చివరి నాటికి పూర్తి చేస్తామని కలెక్టర్ లక్ష్మీశా తెలిపారు. సోమవారం మధ్యాహ్నం ఐఐటీ, ఐసర్‌కు సంబంధించిన పలు అంశాలపై విజయవాడ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. తిరుపతి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ లక్ష్మీశా, జేసీ శుభం బన్సల్, ఐఐటీ, ఐషర్ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. కలెక్టర్ వివరిస్తూ ఐఐటీ, ఐసర్ విద్యాసంస్థలకు సంబంధించి త్వరలోనే సమన్వయ సమావేశం నిర్వహించి, పెండింగ్ పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో జీ సెక్షన్ సూపరింటెండెంట్ భాస్కర్ పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 5: ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సుల ప్రయోగ పరీక్షలు సోమవారం జిల్లాలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఎనిమిది కేంద్రాల్లో 608 విద్యార్థులకు గాను అందరూ హాజరై పరీక్షలు రాశారని ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు.

సైన్స్ టీచర్లకు అవగాహన

జిల్లాలోని సైన్స్ టీచర్లకు మంగళవారం ఉదయం 10 గంటలకు పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో ప్రయోగ పరీక్షల మార్కుల ఎంట్రీపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, సంబధిత టీచర్లు తప్పనిసరిగా హాజరుకావాలని ఆర్ఐవో సూచించారు.

రూ.5.83 కోట్ల సిగరెట్ల పట్టివేత

ఒకరిని అరెస్ట్ చేసిన తిరుపతి సీజీఎస్టీ అధికారులు



తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 5: అక్రమంగా రవాణా చేస్తున్న కోట్లాది రూపాయల విలువజేసే సిగరెట్లను తిరుపతి సీజీఎస్టీ కమిషనరేట్ అధికారులు పట్టుకున్నారు. ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. సీజీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సెంట్రల్ జీఎస్టీ తిరుపతి కమిషనరేట్ పరిధిలోని అనంతపురంలో ఈనెల ఒకటో తేదీన అక్రమంగా ఓ లారీలో రవాణా చేస్తున్న రూ.5.83 కోట్ల విలువైన సిగరెట్ల లోడును అనంతపురం డివిజన్ సెంట్రల్ జీఎస్టీ అధికారులు గుర్తించి పట్టుకున్నారు. 187 కార్టూన్లలో ప్యాక్‌చేసిన 56,10,100 గోల్డ్‌స్టెప్, ప్యారిస్ సిగరెట్ స్టిక్స్ పట్టుబడిన సరుకులో ఉన్నాయి. తదుపరి దర్యాప్తును తిరుపతి సీజీఎస్టీ అధికారులు ప్రారంభించారు. పాట్నాకు చెందిన పొగాకు ఉత్పత్తుల సంస్థ గోల్డ్‌స్టెప్ టొబాకో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్ బిగేంద్రకుమార్‌సింగ్ అగ్గిపెట్టెల రవాణకు అనుమతులు తీసుకుని, వీటికి బదులుగా ఎటువంటి పన్నులూ చెల్లించకుండా సిగరెట్లను పెద్దఎత్తున ఆంధ్రప్రదేశ్‌కు రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. సోమవారం పాట్నాకు వెళ్లిన తిరుపతి సీజీఎస్టీ అధికారులు బిగేంద్రకుమార్‌సింగ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా.. అక్రమ రవాణా చేస్తునట్టు అంగీకరించారని కమిషనర్ వెల్లడించారు.

ఐదుగురిని మింగిన చెరువులు



రత్నమ్మ, మునిరత్నమ్మ (ఫైల్ ఫొటోలు)

వేర్వేరు ప్రాంతాల్లో సోమవారం విషాదం నెలకొంది. ప్రమాదవశాత్తూ చెరువుల్లో పడి ఐదుగురు మృతి చెందారు. పాకాల మండలంలో ముగ్గురు చిన్నారులు మృతి చెందగా, వీరిలో అన్నదమ్ములున్నారు. శ్రీకాళహస్తి మండలంలో తల్లీకూతుళ్లు మృతి చెందారు.



పునీత్, కన్నయ్య, తేజేశ్వర్ మృతదేహాలు

శ్రీకాళహస్తిలో తల్లీకూతుళ్లు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 5: ప్రమాదవశాత్తూ చెరువులో పడి తల్లీకూతుళ్లు మృతి చెందారు. ఈ విషాదకర సంఘటన శ్రీకాళహస్తి మండలంలోని ముచ్చువోలు గ్రామంలో జరిగింది. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రత్నమ్మ, తన కుమార్తె మునిరత్నమ్మతో కలిసి రోజూ ఆవులను మేపేవారు. సోమవారం కూడా తల్లీకూతుళ్ల గ్రామ సమీపంలోని చెరువు గట్టుకు ఆవులను తోలుకెళ్లారు. అక్కడే మధ్యాహ్నం భోజనం చేశారు. ఆవులకు నీటిని తాగించే క్రమంలో ప్రమాదవశాత్తూ ఇద్దరూ చెరువులో పడి మృతిచెందారు. ఆ సమయంలో ఎవరూ గమనించలేదు. సాయంత్రం అటుగా వెళుతున్న కొందరు చెరువు గట్టుపై భోజనం క్యారియర్లు చూశారు. చెరువులో చీర తేలుతుండడంతో అనుమానంతో వెళ్లి చూడగా రత్నమ్మ మృతదేహం బయటపటింది. మరికొందరు గ్రామస్తులు వచ్చి మునిరత్నమ్మ మృతదేహాన్ని గుర్తించారు. విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి టీడీపీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి ముచ్చువోలుకు వచ్చి మృతదేహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

పాకాలలో ముగ్గురు చిన్నారులు

పాకాల, ఫిబ్రవరి 5: ప్రమాదవశాత్తూ చెరువులో మునిగి ముగ్గురు చిన్నారులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పాకాల మండలం దామలచెరువు పంచాయతీ ఊటువంక గ్రామానికి చెందిన రామకృష్ణ, విజయలక్ష్మి దంపతుల కుమారులు పునీత్ (11), కన్నయ్య (9).. శేఖర్, జ్యోతి దంపతుల కుమారుడు తేజేశ్వర్ (9) గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్నారు. సోమవారం సాయంత్రం పాఠశాల ముగిశాక ఇంటికి వచ్చారు. స్కూల్ బ్యాగులు ఇళ్ల వద్ద పెట్టేసి, గ్రామ సమీపంలోని పచ్చిపాల ఓబన్న చెరువు వద్దకెళ్లి ఆడుకుంటున్నారు. ప్రమాదవశాత్తూ తేజేశ్వర్ చెరువులో పడిపోయాడు. అన్నదమ్ములు గమనించి వెంటనే తేజేశ్వర్‌ని రక్షించడానికి వెళ్లి అందరూ నీటిలో మునిగిపోయారు. గ్రామస్తులకు సమాచారం తెలిసి వచ్చేసరికి ముగ్గురూ మృతి చెందారు. కూలీ పనులకు వెళ్లి తిరిగొచ్చిన తల్లిదండ్రులకు విషయం తెలియడంతో వారు గుండెలు పగిలేలా రోదించారు. పాకాల సీఐ రాజగోపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చిన్నారుల మృతికి కారణమైన పచ్చిపాల ఓబన్న చెరువు

అభివృద్ధిని విస్మరించిన ఎమ్మెల్యే : టీడీపీ

రామచంద్రాపురం, ఫిబ్రవరి 5: ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సొంత ప్రయోజనాలు చూసుకోవడం మినహా నియోజకవర్గ అభివృద్ధి గురించి పట్టించుకోలేదని టీడీపీ నాయకుడు పులివర్తి వినీల్ విమర్శించారు. సోమవారం మండంలోని గణేశ్వరపురం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా నాయకులు జనార్ధనచౌదరి, నరసింహారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మండల నాయకులు గిరి నాయుడు, మునిరామిరెడ్డి, ధనంజయరెడ్డి, రాజమాణిక్యంనాయుడు, సురేంద్ర నాయుడు, భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

రాత్రి 11 గంటలకు డాబాలు మూసివేయాలి


డాబా యజమానులతో మాట్లాడుతున్న సీఐ రామయ్య

చంద్రగిరి, ఫిబ్రవరి 5: చంద్రగిరి మండలంలోని పూతలపట్టు-నాయుడుపేట, తిరుపతి-మదనపల్లె జాతీయ రహదారుల్లో ఉన్న డాబాలు, హోటళ్ళు రాత్రి 11 గంటలకు మూసివేయాలని సీఐ రామయ్య తెలిపారు. సోమవారం మండలంలోని డాబాలు, హోటళ్ళు యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాబాల ముందు వాహనాలు నిలపడం వలన తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, దీంతో ఎంతో మంది ప్రాణాలు పోతున్నాయని పేర్కొన్నారు. డాబాలు, హోటళ్ళ యజమానులు సహకరించాలని సీఐ కోరారు.

ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగింపు

పెరంబూర్, ఫిబ్రవరి 5: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగిస్తున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

● నెం.08543 విశాఖపట్టణం -ఎస్ఎంవీటీ బెంగళూరు (వయా.. కాట్పాడి, జోలార్‌పేట) ప్రత్యేక వారాం తపు రైలు ఈ నెల 11, 18, 25, మార్చి 3, 10, 17 24, 31 (ఆదివారం) తేదీల్లో విశాఖపట్టణంలో మధ్యాహ్నం 3.55 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12.30 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. అలాగే, నెం.08544 బెంగళూరు-విశాఖపట్టణం (వయా... జోలార్‌పేట, కాట్పాడి) ప్రత్యేక వారాంతపు ప్రత్యేక రైలు ఈ నెల 12 19, 26, మార్చి 4, 11, 18, 25, ఏప్రిల్ 1 (సోమవారం) తేదీల్లో బెంగళూరు నుంచి మధ్యాహ్నం 3.50 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.30 గంటలకు విశాఖపట్టణం చేరుకుంటుంది.

● నెం.07153 నరసాపూర్ - బెంగుళూరు స్పెషల్ (వయా... కాట్పాడి, జోలార్‌పేట) ఈ నెల 9, 16, 23, మార్చి 1, 8, 15, 22, 29 (శుక్రవారం) తేదీల్లో నరసాపూర్ నుంచి మధ్యాహ్నం 3.50 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 9.30 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. నెం.07154 బెంగళూరు-నరసాపూర్ స్పెషల్ (వయా... జోలార్‌పేట, కాట్పాడి) ఈ నెల 10, 17, 24, మార్చి 2, 9, 16, 23, 30 తేదీల్లో బెంగళూరు నుంచి ఉదయం 10.50కి మరుసటిరోజు ఉదయం 6 గంటలకు నరసాపూర్ చేరుకుంటుంది.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

నారాయణవనం, ఫిబ్రవరి 5: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. సోమవారం కీళగరం వద్ద ఉన్న అరుణానదిలో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లును పోలీసులు అడ్డుకుని, స్వాధీనం చేసుకున్నారు. గత కొన్ని నెలలుగా అరుణా నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని గ్రామస్తులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు నిఘా ఏర్పాటు చేసి, ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఇసుక ట్రాక్టర్ల యజమాని, స్థానిక వైసీపీ నేత ఊరప్ప, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు.

యువతను సన్మార్గంలో నడిపించాలి

● ప్రతి గ్రామంలో ఆలయాలు నిర్మించాలి
● చివరి రోజు ధార్మిక సదస్సులో పీఠాధిపతులు

తిరుమల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లలకు భగవంతుడిపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఊరిలోనూ వారానికి ఒకసారి ప్రవచనాలు, ప్రార్థన గురించి తెలిపాలని ఉడిపి మఠాధిపతి వేదవర్ధన పేర్కొన్నారు. అదే సమయంలో యువతను సన్మార్గంలో నడిపించడానికి కృషి చేయాలన్నారు. తిరుమల ఆస్థానమండపంలో మూడు రోజుల పాటు జరిగిన ధార్మిక సదస్సు సోమవారం ముగిసింది. చివరి రోజు పలువురు స్వామిజీలు అనుగ్రహభాషణం చేశారు. శ్రీరంగంలోని పాండరికపురం ఆశ్రమానికి చెందిన పరవకొట్టై చిన్న ఆండవన్ శ్రీనివాస గోపాల మహాదేశికన్ మాట్లాడుతూ ధర్మప్రచారంలో భాగంగా టీటీడీ పాఠశాలలు, కళాశాలల్లో పిల్లలకు నైతిక పోటీలు నిర్వహించి, మన సంప్రదాయాలను కొనసాగించాలన్నారు. వేదాలను దేశమంతా ప్రచారం చేయాలన్నారు. వారణాశిలోని బ్రహ్మానంద మఠాధిపతి సదాశివ మాట్లాడుతూ.. సంస్కృత సుభాషితాలు, విష్ణుసహస్రనామ పారాయణం ప్రత్యేకంగా బోధించాలన్నారు. రాఘవేంద్ర మఠాధిపతి సువిద్యేంద్ర తీర్థ మాట్లాడుతూ టీటీడీ వేదపరిరక్షణ చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వేద పరిరక్షణే ధర్మపరిరక్షణ అన్నారు. గోసంరక్షణ ఆవశ్యకత చాలా ఉందన్నారు. ప్రతిగ్రామంలో దేవాలయాలు నిర్మించాలన్నారు. సంస్కృత భాష అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

చంద్రగిరి

టీడీపీ కార్యకర్తపై వైసీపీ దాడి


గాయపడిన టీడీపీ కార్యకర్త భరత్

పాకాల, ఫిబ్రవరి 5: ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్.భరత్‌పై వైసీపీకి చెందినవారు సోమవారం సాయంత్రం దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు... ఉప్పరపల్లె పంచాయతీ మల్లెల చెరువుకు చెందిన ఎన్.భరత్ ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఓ టీ దుకాణం వద్ద తన మిత్రులు కె.రెడ్డి ప్రసాద్, ఎం.మహేష్, పి.వినోద్ కుమార్‌తో కలిసి టీ తాగి వెళ్తుండగా వైసీపీకి చెందిన సామిరెడ్డిపల్లె వాసులు రవితేజారెడ్డి, హరీష్‌రెడ్డి, భారతంమిట్టకు చెందిన చరణ్, చెన్నుగారిపల్లెకు చెందిన జీవన్‌రెడ్డిలు మరికొందరితో కలిసి భరత్‌పై మూకుమ్మడిగా దాడి చేశారు. ముఖంపై కొట్టడంతో ఎడమ కన్నువద్ద గాయమైంది. చంపేస్తామని బెదిరించారు. ఈ మేరకు పాకాల పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. సోషల్ మీడియాలో ఇరువర్గాలు చేసుకుంటున్న కామెంట్లు ఈ గొడవకు కారణమని తెలుస్తోంది.

పాకాల తహసీల్దార్‌గా వాణిశ్రీ

పాకాల, ఫిబ్రవరి 5: పాకాల మండల తహసీల్దార్‌గా బి.వాణిశ్రీ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం డివిజినల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా ఉన్న ఈమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా వున్న భాగ్యలక్ష్మి వైఎస్ఆర్ జిల్లా సీకే దిన్నె మండలానికి బదిలీ అయ్యారు.

చంద్రగిరి తహసీల్దార్, ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

చంద్రగిరి, ఫిబ్రవరి 5: చంద్రగిరి తహసీల్దార్‌గా మారుతి, ఎంపీడీవోగా డాక్టర్ వీవీ సూర్యసాయి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల బదిలీల్లో చంద్రగిరిలో పనిచేసిన శిరీష వైఎస్ఆర్ జిల్లా పోరుమావిళ్ళ తహసీల్దార్‌గా వెళ్ళారు. అనంతపురం జిల్లా రాయదుర్గంలో తహసీల్దార్‌గా పనిచేసే మారుతి బదిలీపై చంద్రగిరికి వచ్చారు. చంద్రగిరి ఎంపీడీవోగా పనిచేసిన బాలాజీనాయక్ నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరుకు బదిలీ కాగా, చిల్లకూరు మండల ఎంపీడీవో డాక్టర్ వీవీ సూర్యసాయి చంద్రగిరికి వచ్చారు.

రేపు 'శ్రీవేంకటేశ్వర నవరత్న మాలిక'

తిరుమల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): టీటీడీ దాససాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో కర్ణాటక సంగీత పితామహుడు పురందరదాసు ఆరాధాన మహోత్సవాలు బుధవారం నుంచి 10వ తేదీ వరకు తిరుమల ఆస్థానమండపంలో నిర్వహించనున్నారు. తొలిరోజు కల్యాణ వేదికలో రాత్రి 7 గంటలకు యువ కళాకారులతో 'శ్రీవేంకటేశ్వర నవరత్న మాలిక' గోష్ఠిగానం నిర్వహించనున్నారు. పురందరదాసు రచించిన 4.75 లక్షలకు పైగా సంకీర్తనల్లో ప్రధానమైన తొమ్మిదింటిని దాదాపు 300 మంది సుప్రసిద్ధ కళాకారులు గోష్ఠిగానం చేస్తారు.

ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వహించాలి


మాట్లాడుతున్న డీఆర్వో పెంచలకిషోర్

తిరుపతి (కలెక్టరేట్), ఫిబ్రవరి 5: సార్వత్రిక ఎన్నికల్లో వివిధ శాఖల నోడల్ అధికారులు తమకు కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వహించాలని డీఆర్వో పెంచలకిషోర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో చిన్న పొరపాటు జరిగినా భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎన్నికల ఏర్పాట్లపై నోడల్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు.

'నవ' స్పందన

● కూర్చోబెట్టి అర్జీల స్వీకరణ



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 5: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో అత్యధికంగా భూ సమస్యలపై 153మంది ఫిర్యాదు చేశారు. మొత్తంగా వివిధ శాఖలకు సంబంధించి 201 అర్జీలు అందాయి. జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచలకిషోర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అర్జీలు స్వీకరించారు. కాగా.. కొత్త కలెక్టర్ లక్ష్మీశ, స్పందనలో కొన్ని మార్పులు చేశారు. అధికారుల ముందు గుంపులు లేకుండా, అందరినీ కుర్చీల్లో కూర్చొనేలా ఏర్పాటు చేశారు. టోకెన్‌లు కేటాయించి, ప్రతి ఒక్కరి సమస్యనూ సావధానంగా విన్నారు. అర్జీలు రాయడం రానివారి కోసం ముఖద్వారం దగ్గరే కొంతమందిని నియమించి, అర్జీ రాయించే ఏర్పాటు చేశారు.

ప్రభుత్వం ఇచ్చిన స్థలంపై వైసీపీ నేతల దౌర్జన్యం



రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ తారకరామనగర్‌లో ప్లాట్ నెంబరు2675ను అప్పటి ప్రభుత్వం మాకు కేటాయించింది. ఆ స్థలంలో ఇల్లు కూడా కట్టుకున్నాం. అయితే ఇటీవల అదే ప్లాట్‌ను రేణిగుంట తహసీల్దారు తమకు కేటాయించారంటూ వైసీపీ వారు మా ఇంటి వద్దకు వచ్చి దౌర్జన్యం చేస్తున్నారు.

\- మంగమ్మ, కరకంబాడి

విశ్వకర్మలకు అవమానం



18 రకాల చేతివృత్తుల వారికి చేయూతనివ్వడానికీ, వారి ఆత్మ గౌరవం పెంచేందుకూ ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన ప్రవేశ పెడితే, రాష్ట్ర ప్రభుత్వం ఆ పథకాన్ని నీరుగారుస్తోంది. దాన్ని సక్రమంగా అమలు చేయాలి. సచివాలయాల దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నారు.

\- కలెక్టరేట్ వద్ద నిరసనలో బీజేపీ నేతలు

మోసం జగన్!



జిల్లాలో సివిల్ సప్లయీస్ హమాలీ కార్మికులకు జీతాలు సరిగా అందడంలేదు. చనిపోయిన వారికి పీఎఫ్ డబ్బులు ఖాతాలో జమ కావడంలేదు. ఈ ప్రభుత్వం దగా చేస్తోంది. ఐదేళ్లుగా జగన్‌రెడ్డి ప్రభుత్వం మోసపూరిత హామీలు ఇస్తోంది. ఇప్పటికైనా మా సమస్యలు పరిష్కరించండి.

\- కలెక్టరేట్ వద్ద ఆందోళనలో సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సివిల్ సప్లయీస్ కార్మికసంఘం నేతలు అయ్యప్ప, సురేష్, చెంచయ్య, పాండు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


శరవణన్ (ఫైల్‌ఫొటో)

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 5: ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన సంఘటన పుత్తూరులో జరిగింది. మృతుడి కుటుంబసభ్యుల కథనం మేరకు... గేటు పుత్తూరు పరిధిలోని శీలకారవీధికి చెందిన ఎంఈ. గుణశేఖర్ కుమారుడు ఎంజీ. శరవణన్(28) నేతవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం తిరుమలకు ప్యానికి చెందిన తన స్నేహితుడు నరేష్‌తో కలిసి సోమవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై నగరికి బయలుదేరాడు. నంది మంగళం క్రాస్ వద్దకు చేరుకోగానే గుర్తు తెలియని వాహనం వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో శరవణన్ అక్కడికక్కడే మృతి చెందగా, నరేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రథమ చికిత్స అనంతరం నరేష్‌ను తిరుపతి రుయాకు తరలించారు.

బీవీబీలో నేడు, రేపు సైన్స్ టీచర్లకు శిక్షణ

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 5: తిరుపతిలోని భారతీయ విద్యాభవన్స్‌లో మంగళ, బుధవారాల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో(చిత్తూరు, తిరుపతి) ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే దాదాపు 80మంది సైన్స్ టీచర్లకు ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ నిర్వహిస్తున్నట్లు జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ పేర్కొన్నారు. ఐసర్(తిరుపతి), రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ(ఆర్ఎస్సీ), ఇన్నోవేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్(ఐఎస్‌టీఎఫ్), భారతీయ విద్యాభవన్స్ సంయుక్త ఆధ్వర్యంలో రసాయనశాస్త్ర బోధనలో నైపుణ్యాల పెంపుకు ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రుయాలో కార్డియో థొరాసిక్ హెచ్‌వోడీ నియామకం

● రేపటి నుంచి సేవలు


డాక్టర్ కళ్యాణి రమకు స్వాగతం పలుకుతున్న సూపరింటెండెంట్ రవిప్రభు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 5: రుయాస్పత్రిలో రోగులకు కార్డియో థొరాసిక్ ఓపీ సేవలను అందుబాటులోకి తీసుకువస్తుండటం గొప్ప విషయమని సూపరింటెండెంట్ రవిప్రభు అన్నారు. రుయాస్పత్రి కార్డియో థొరాసిక్ విభాగాధిపతిగా డాక్టర్ కళ్యాణి రమ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె విజయవాడలోని సిద్ధార్థ వైద్య కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. సూపరింటెండెంట్ రవిప్రభు స్వాగతం పలికి, బాధ్యతలు అప్పజెప్పారు. కొన్నేళ్లుగా కార్డియో థొరాసిక్ సేవలు అందుబాటులో లేక రోగులు ఎంతగానో ఇబ్బంది పడుతున్నారని, ఇకపై ఓపీ నంబర్ 20వ గదిలో బుధ, శనివారాల్లో సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. డాక్టర్ కళ్యాణి రమను ఏఆర్ఎంవో డాక్టర్ హరికృష్ణ, సిబ్బంది చిరంజీవి, షాహీద అభినందించారు.

ఆగని గ్రావెల్, ఇసుక తవ్వకాలు


శిరసనంబేడులో గ్రావెల్ తవ్వకాలతో ఏర్పడిన గోతులు

పెళ్లకూరు, ఫిబ్రవరి 5: పెళ్లకూరు మండలంలో గ్రావెల్, ఇసుక తవ్వకాలు యధేచ్ఛగా సాగుతున్నాయి. ప్రభుత్వ భూములు, స్వర్ణముఖినది నుంచి గ్రావెల్, ఇసుకను తోడేస్తున్నారు. మండలంలో పుల్లూరు నుంచి తాళ్వాయిపాడు వరకు సుమారు 20 కిలోమీటర్ల మేర స్వర్ణముఖినది ప్రవహిస్తుంది. అదే విధంగా రోసనూరు, శిరసనంబేడు, బంగారంపేట, సీఎన్‌పేట తదితర గ్రామాల్లో ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ లభిస్తుంది. నాయుడుపేట - రేణిగుంట జాతీయ రహదారి విస్తరణ పనుల పేరిట రాత్రి, పగలు తేడా లేకుండా వందలాది వాహనాల ద్వారా గ్రావెల్, ఇసుక ఇతర అవసరాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా బహిరంగ రహస్యమే అయినప్పటికీ అధికార పార్టీకి చెందిన ఓ ముఖ్యనేత భాగస్వామ్యం కావడంతో అధికారులు మౌనం వహిస్తున్నారు. వివిధ ప్రభుత్వ భవనాలతో పాటు పక్కా గృహాల నిర్మాణాలకు స్వర్ణముఖినది నుంచి ఇసుక, నాయుడుపేట - రేణిగుంట జాతీయ రహదారి విస్తరణ పనుల కోసం గ్రావెల్ తరలించేందుకు అధికారులు అనుమతులు ఇస్తున్నారు. దీన్ని అడ్డం పెట్టుకొని అక్రమార్కులు తవ్వకాలు జరుపుతున్నారు. యడకూడి, పుల్లూరు, కలవకూరు, ముమ్మారెడ్డిగుంట, పెన్నేపల్లి, తాళ్వాయిపాడు తదితర ప్రాంతాల నుంచి ఇసుకను తరలిస్తుండటంతో భూగర్భజలాలు అడుగంటి తాగు, సాగునీటికి ఇబ్బందులు ఎదురవుతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా నందిమాల, చెన్నప్పనాయుడుపేట, బంగారంపేట, శిరసనంబేడు, రోసనూరు తదితర ప్రాంతాల నుంచి గ్రావెల్‌ను తరలిస్తున్నారు. ఉన్నతాధికారులుస్పందించి గ్రావెల్, ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దగా డీఎస్సీ మాకొద్దు.. మెగా డీఎస్సీ కావాలి..!

విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నగరంలో పోరుబాట


ర్యాలీ నిర్వహిస్తున్న డీఎస్సీ అభ్యర్థులు, యువజన సంఘాల నేతలు

తిరుపతి(విద్య),ఫిబ్రవరి 5: రాష్ట్రంలో డీఎస్సీ నోటిఫికేషన్ కోసం నాలుగన్నరేళ్లుగా ఆశగా ఎదురుచూసిన నిరుద్యోగులకు ప్రభుత్వం తూతూమంత్రంగా పోస్టులను విడుదల చేసి నిరాశపరచిందని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.జయచంద్ర పేర్కొన్నారు. డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో ఆందోళన చేపట్టారు. అన్నమయ్యసర్కిల్‌లో రాస్తారోకో నిర్వహించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్కడి నుంచి ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. ఆర్డీవో కార్యాలయం లోపలకు చొచ్చుకుపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కొంతసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. జయచంద్ర మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సెకండరీగ్రేడ్ టీచర్ పోస్టులు కేవలం 8 మాత్రమే ఉండగా.. 8 జిల్లాల్లో ఎస్జీటీ పోస్టుల సంఖ్య సున్నగా ఉందని పేర్కొన్నారు. ప్రాథమిక విద్యను బోధించే ఎస్జీటీ టీచర్ పోస్టులను అరకొరగా కేటాయించడం దుర్మార్గమన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ సీఎం జగన్ ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు చలపతి మాట్లాడుతూ డీఎస్సీ నోటిఫికేషన్‌ను సవరించి 25వేల పోస్టులతో ప్రకటించాలన్నారు. డీఎస్సీ అభ్యర్థులు నవీన్,కార్తీక్,హరినాథ్,ప్రశాంత్, విద్యార్థినాయకులు అక్బర్, సురేష్, ఉదయ్, హరి, అశోక్, శివ,పవన్ పాల్గొన్నారు.

తల్లీబిడ్డల అదృశ్యం..

కేసు నమోదు


గుణవతి, నీలవేణి, వినోద్

ఏర్పేడు, ఫిబ్రవరి 5: తల్లి ఇద్దరు బిడ్డలు అదృశ్యమన ఘటన ఏర్పేడు మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ శ్రీరామ శ్రీనివాసులు కథనం మేరకు.. గుండ్లకండ్రిగ గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం భార్య గుణవతి(30). వీరికి కుమార్తె నీలవేణి(13), కుమారుడు వినోద్ (11) ఉన్నారు. గతనెల 20వ తేదీన కుమార్తెకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో భార్యా పిల్లలను చికిత్స నిమిత్తం రేణిగుంటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి పంపించాడు. యథావిధిగా కూలి పనులకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చాడు. అప్పటికీ భార్యా బిడ్డలు రాలేదు. అప్పటినుంచి పలుచోట్ల గాలించినా ఫలితం లేక పోయింది. దీంతో సోమవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మండలంలో తుడా ఛైర్మన్ పర్యటన

చంద్రగిరి, ఫిబ్రవరి 5: చంద్రగిరి మండలంలోని మిట్టపాలెం, నరసింగాపురం, రామిరెడ్డిపల్లె, శానంబట్ల పంచాయతీలలో సోమవారం తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పర్యటించారు. ఆయా పంచాయతీలలో జరిగిన అభివృద్ధిని వివరించారు. ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వైసీపీ సేవాదళ్ జిల్లా కార్యదర్శిగా శ్రీనివాసులరెడ్డి

వైసీపీ సేవాదళ్ జిల్లా కార్యదర్శిగా చంద్రగిరి మండలం కందులవారిపల్లెకు చెందిన పాలెం శ్రీనివాసులురెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీలో బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

రామకుప్పంలోకి మదపుటేనుగు

రామకుప్పం, ఫిబ్రవరి 5: గుడపల్లెలో ఒకరిపై, శాంతిపురంలో కారుపై దాడి చేసిన మదపుటేనుగు సోమవారం తెల్లవారుజామున రామకుప్పం మండలం ముద్దనపల్లె అడవిలోకి ప్రవేశించింది. సమీప పంటపొలాలను తొక్కుకుంటూ అది సమీప అడవిలోకి ప్రవేశించిందని స్థానిక రైతులు తెలిపారు. సోమవారం సాయంత్రం వరకు కూడా అది ముద్దనపల్లె అటవీ బీట్‌లోనే ఉన్నట్టు ఫారెస్టర్ బాబుప్రసాద్ తెలిపారు. అటవీ సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

నాడు ప్రథమం... నేడు అధమం

● నష్టాలబాటలో సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో
● కొత్త బస్సులు రాకపోగా.. ఉన్నవీ రద్దు
● పల్లె వెలుగు సర్వీసులకే పరిమితం


సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 5: ఉమ్మడి నెల్లూరు జిల్లాలో అత్యంత ప్రాధాన్య కలిగిన సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న ఈ డిపోను 1999 ఏప్రిల్ 16న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. మూడేళ్ల వరుసగా మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి కైవసం చేసుకుంది. 2007, 2009లోనూ కోటి రూపాయల ఆదాయంతో ప్రథమ స్థానంలో నిలిచింది. అలాంటిది ప్రస్తుతం మూడు కోట్ల మేరకు నష్టాల్లో నడుస్తూ 120వ ర్యాంక్‌తో రాష్ట్రంలో చివరి స్థానంలో ఉంది. ఒకప్పుడు సూళ్లూరుపేట డిపో నుంచి బెంగళూరు, హైదరాబాదు, కడప, మదనపల్లె, ద్రాక్షరామం, తిరుమల, కావలి ప్రాంతాలకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడిచేవి. రాబడి కూడా బాగా వచ్చేది. గతంలో 49 సర్వీసులు ఉన్న డిపోలో నేడు 25 మాత్రమే ఉన్నాయి. ఇవి కాకుండా అద్దె బస్సులు ఏడు నడుస్తున్నాయి. మిగిలిన సర్వీసులను ఇతర డిపోలకు తరలించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు వచ్చి సర్వీసులు అడిగినా బస్సులు పంపే స్థితిలో అధికారులేరంటే డిపో పరిస్థితి ఏమిటో ఇట్టే తెలుస్తోంది. సూళ్లూరుపేట నుంచి జిల్లా కేంద్రమైన తిరుపతికి ఒకప్పుడు అరగంటకు ఒక బస్సు ఉండేది. ప్రస్తుతం 5 బస్సులు మాత్రమే తిరుపతి మార్గంలో తిరుగుతున్నాయి. అదే విధంగా సూళ్లూరుపేట - కోట మార్గంలో ప్రతి గంటకు ఒక బస్సు తిప్పేవారు. ఆ మార్గంలోనూ ఇదే పరిస్థితి. ఉన్న అరకొర సర్వీసులను అధికారులు ఏదో ఒక కారణంతో తరచూ రద్దు చేస్తున్నారు. ఇక సూళ్లూరుపేట నుంచి తడ మీదుగా నడిచే బస్సులను పూర్తిగా రద్దుచేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించుకొన్న పట్టించుకోలేదు. ప్రస్తుతం ఆయా మార్గాల్లో తమిళనాడు బస్సులు తిరుగుతున్నాయి. షార్ ఉద్యోగుల కోసం సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోట - బెంగళూరు మధ్య రెండు సర్వీసులు నడిపేవారు. అలాగే తిరుమలకు సర్వీసులు ఉండేవి. ప్రస్తుతం ఒక బస్సు కూడా తిప్పడం లేదు. బెంగళూరు, హైదరాబాద్, తిరుమలకు బస్సులు నడపాలని ప్రజలు, ఇస్రో ఉద్యోగులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అయితే కర్ణాటక ఆర్టీసీ మాత్రం శ్రీహరికోటకు బస్సు నడుపుతుండడం గమనార్హం. ఒకప్పుడు లాభాల్లో నడుస్తూ బహుమతులు అందుకున్న డిపో నేడు నష్టాల బట పట్టడానికి పాలకులతో పాటు అధికారులు కూడా కారణమని చెప్పాలి. ఆదాయ మార్గాల్లో అదనపు సర్వీసులు నడపకపోగా ఉన్నవీ రద్దు చేయడం, ప్రయాణికులు కోరినా బస్సులను తిప్పడంలేదు. ముఖ్యంగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డిపో పరిస్థితి మరింత దిగజారిపోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైన డిపో అధికారులు స్పందించి దూర ప్రాంతాలకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులతో పాటు ప్రయాణికుల రద్దీ ఉన్న మార్గాల్లో బస్సులు నడిపితే నష్టాలనుంచి గట్టెక్కించవచ్చు.

శ్రీసిటీలో కేంద్ర పర్యావరణ, అటవీశాఖ అధికారులు


అధికారులకు శ్రీసిటీ వివరాలు తెలియజేస్తున్న ప్రతినిధులు

శ్రీసిటీ, ఫిబ్రవరి 5: చెన్నైలోని పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ(ఎంఈఎఫ్, సీసీ) ప్రాంతీయ కార్యాలయానికి చెందిన డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్టు(డీడీజీఎఫ్) డాక్టర్ వి.జార్జ్ జెన్నర్, ఐఎఫ్ఎస్ సోమవారం శ్రీసిటీని సందర్శించారు. వీరితోపాటు యువరాజు, ఐఎఫ్ఎస్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్టు(డీఐజీఎఫ్) చెన్నై, బాలాజీ, ఐఎఫ్ఎస్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్టు(ఏఐజీఎఫ్), ఇంటిగ్రేటెడ్ రీజనల్ ఆఫీస్(ఐఆర్‌వో) విజయవాడ, రామాయపట్నం పోర్టు మేనేజింగ్ డైరెక్టర్ పి.ప్రతాప్‌రెడ్డి ఉన్నారు. వీరికి శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికి, బిజినెస్ సిటీ ముఖ్య అంశాలను తెలియజేశారు. పారిశ్రామిక పార్కు కర్బన్ శూన్యత స్థితిని అందుకోవడానికి అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరిస్తూ, పారిశ్రామిక వృద్ధి, సుస్థిరత మధ్య సంపూర్ణ సమన్వయంతో ప్రపంచ స్థాయి వ్యాపార కేంద్రాన్ని నిర్మించడమే తమ లక్ష్యమని తెలిపారు. శ్రీసిటీలో ప్రకృతికి ఇస్తున్న ప్రాధాన్యంపై డాక్టర్ జార్జ్ జెన్నర్ ప్రశంసించారు. సన్నారెడ్డి కృషిని కొనియాడుతూ చెన్నైకి అత్యంత సమీపంలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతో చక్కటి ప్రణాళికతో కూడిన నగరాన్ని చూడడం ఆశ్చర్యంగా ఉందని అన్నారు. అలాగే దేశ, విదేశాలకు చెందిన వివిధ పరిశ్రమలకు అన్ని సదుపాయాలను కల్పించి, వేలాది మంది స్థానిక ప్రజలకు జీవనోపాధిని కల్పించడం స్ఫూర్తిదాయకంగా ఉందని వ్యాఖ్యానించారు. అనంతరం అధికారులంతా వివిధ ప్రదేశాల్లో పర్యటించాక, ఇసుజు మోటార్స్ ఉత్పత్తి యూనిట్‌ని కూడా సందర్శించారు.

ధాన్యం ధరలు తగ్గుముఖం

● ఆవేదనలో రైతన్న


ధాన్యం బస్తాలను ట్రాక్టర్‌కు ఎత్తుతున్న కూలీలు

పెళ్లకూరు, ఫిబ్రవరి 5: రబీ సీజన్‌లో సాగుచేసిన వరి పంటల కోతలు ప్రారంభమయ్యాయి. వారం కిందట బీపీటీ 5204 రకం 75 కిలోల బస్తా రూ.2100 ధర పలికింది. ప్రస్తుతం రూ.1900కి పడిపోయింది. అలాగే ఆర్ఎన్ఆర్ 15048 రకం రూ.2300 నుంచి రూ.2100కి, కేఎన్ఎం 1638 రకం రూ.2150 నుంచి రూ.2000కి, ఎన్ఎల్ఆర్ 34449 రకం రూ.1,650 నుంచి రూ.1400కి, ఎంటీయూ 1010 రకం 75 కిలోల బస్తా రూ.1650 నుంచి రూ.1400కు తగ్గిపోయింది. మరోవైపు దిగుబడులు కూడా ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు ఈప్రాంత రైతులు మన రాష్ట్రంలో ధరలు తగ్గాయనుకుంటే తమిళనాడు, కర్ణాటకలకు ఎగుమతులు చేసి లాభాలు గడించేవారు. ప్రస్తుతం దేశమంతా ఒకే పన్ను కిందకు రావడంతో మిల్లర్లంతా జాతీయ స్థాయిలో సిండికేట్‌గా మారుతున్నారు. దీనివల్ల ఎక్కడికి పోయినా ప్రయోజనం ఉండటం లేదని రైతులు చెబుతున్నారు.

కొనుగోలు కేంద్రాలెక్కడ? : ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ఇవి లేకపోవడంతో దళారుల దోపిడీకి గురవుతున్నామని చెబుతున్నారు.

తిరుపతి

టీటీడీకి కానుకగా ద్విచక్ర వాహనం



వాహనం తాళాలను అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

తిరుమల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి సోమవారం ఓ ద్విచక్ర వాహనం విరాళంగా అందింది. బిగాస్ సంస్థ ప్రతినిధులు రూ.1.20 లక్షల విలువైన విద్యుత్ ద్విచక్ర వాహనాన్ని విరాళంగా ఇచ్చారు. సోమవారం ఆలయం ముందు ప్రత్యేక పూజలు నిర్వహించి, తాళాలను డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్‌కు అందజేశారు. టీటీడీ ట్రాన్స్‌పోర్టు డీఐ జానకి రామరెడ్డి, తిరుపతికి చెందిన గ్రాయత్రి ఆటోమెటివ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సిద్ధవైద్యం ప్రాముఖ్యత ప్రపంచానికి తెలియాలి

● శ్వేత డైరెక్టర్ భూమన సుబ్రహ్మణ్యం రెడ్డి



ద్విచక్ర వాహనాలపై బయల్దేరిన సిద్ధవైద్య నిపుణులు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 5 : సిద్ధులు, రుషులు, జ్ఞానులు మనకు ఇచ్చిన ఆరోగ్య సంపదల్లో సిద్ధ వైద్యం ప్రధానమైందని, అంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ వైద్యం ప్రపంచానికి తెలియాల్సిన అవసరముందని శ్వేత డైరెక్టర్ భూమన సుబ్రహ్మణ్యం రెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరూ సిద్ధ వైద్యం పొందాలనే ఉద్దేశంతో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సిద్ధ చెన్నై వారు ద్విచక్ర వాహనాలపై ఢిల్లీ టూ కన్యాకుమారి కార్యక్రమానికి గత నెల 24న ఢిల్లీలో శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా వీరు సోమవారం తిరుపతిలోని శ్వేత భవనానికి చేరుకున్నారు. శ్వేత డైరెక్టర్ భూమన సుబ్రహ్మణ్యం వీరికి స్వాగతం పలికి అభినందించారు. టీటీడీ సిబ్బందికి సిద్ధవైద్యం మందుల కిట్లను అందించారు. ఈ కార్యక్రమంలో సిద్ధ వైద్య సిబ్బంది రాజ్యలక్ష్మి, షెన్‌బగవల్లి, ముత్తుకుమరన్ పాల్గొన్నారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న సంస్థ స్టాఫ్

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 5: శుభమస్తు సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు బయ్యా వెంకటరమణయ్య వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వీవీమహల్ రోడ్డులోని శుభమస్తు షాపింగ్‌మాల్ ఆవరణలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆ సంస్థ కూలీలు, కొంతమంది వినియోగదారులు రక్తదానం చేశారు. వీరిని యాజమాన్యం సత్కరించింది. షాపింగ్‌మాల్ మేనేజర్ మునిశంకర్ మాట్లాడుతూ తిరుపతిలో తమ బ్రాంచ్ ప్రారంభం నుంచి ఏటా సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. విజయవంతం చేసిన స్టాఫ్, వినియోగదారులను అభినందించారు. కాంచీపురం పెరుమాల్ సిల్క్స్ మేనేజర్ రాజేష్, శివజ్యోతి ఫౌండేషన్ సభ్యులు భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సన్మానం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న జిల్లా వీఆర్వోల సంఘం నేతలు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 5: తిరుపతి జిల్లా కలెక్టర్ లక్ష్మీశాను సోమవారం తిరుపతి డివిజన్ వీఆర్వో అసోసియేషన్ అధ్యక్షుడు చెంగల్‌రాయులు ఆధ్వర్యంలో సత్కరించారు. వీఆర్వోలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు తెలిపారు. సానుకూలంగా స్పందించి జేసీ శుభం బన్సల్‌కు తెలిపి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, ప్రసాద్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బీవీబీలో విద్యార్థుల వీడ్కోలు సభ



తిరుపతి(విద్య), ఫిబ్రవరి 5 : భారతీయ విద్యాభవన్స్ స్కూల్లో 10, 12 తరగతులు చదివే విద్యార్థులకు సోమవారం వీడ్కోలు సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఐఐటీ ప్రొఫెసర్ రఘురామరాజు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్యపై దృష్టి సారించి, ఆశయాల సాధనకు ప్రణాళికలు ఆచరించాలని తెలిపారు. పబ్లిక్ పరీక్షలలో ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. డైరెక్టర్ సత్యనారాయణరాజు మాట్లాడుతూ చదువుతో పాటు ప్రకృతి వికాసానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. హెచ్‌ఎం వాణిశ్రీ, కమిటీ సభ్యులు, టీచర్లు పాల్గొన్నారు.

మద్యం బాటిల్లో మెత్తటి ముక్క

● సగానికిపైగా తాగిన తర్వాత చూసుకున్న మద్యం ప్రియులు

● అట్టముక్కంటున్న సిబ్బంది



తిరుపతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో సోమవారం ఓ వ్యక్తి ఫుల్‌బాటిల్ కొనుగోలు చేశాడు. మిత్రులతో కలసి సగానికిపైగా తాగారు. ఇంతలో రెండు అంగుళాల పొడవు, వెడల్పుతో ఒక వస్తువును గమనించారు. ఒక్కసారిగా వాళ్లకు మత్తు దిగిపోయింది. షాపు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. వేరే బ్రాండ్ మద్యం బాటిల్ తీసుకుని వెళ్లిపోయారు. బాధితులిచ్చిన సమాచారం మేరకు..తిరుపతి ఆటోనగర్‌లోని మద్యం దుకాణంలో కింగ్ లూయిస్ పేరుగల బ్రాందీ ఫుల్ బాటిల్‌ను కొనుగోలు చేశారు. సగానికి పైగా మద్యం తాగిన తర్వాత మెత్తగా ఏదో ఒక వస్తువు కనిపించింది. ఖంగుతున్న వినియోగదారులు షాపు దగ్గరకు పరుగులు తీశారు. సిబ్బందిని నిలదీశారు. ఫిల్టర్ మూత కలిగిన బాటిల్లో తాము ఏమీ చేయలేమని, తయారీలోనే పొరబాటు జరిగి ఉంటుందని, అట్టముక్కలాంటిదేదో ఉందని సిబ్బంది నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కంపెనీ రెప్రజెంటేటివ్‌తో మాట్లాడి కొనుగోలుదారులకు వేరే బాటిల్ ఇచ్చి పంపించారు. నెల్లూరు జిల్లా సర్వేపల్లి (ముత్తుకూరు)లోని ఎస్ఎన్‌జీ డిస్టిల్లరీస్ నుంచి ఆ బాటిల్ తయారైనట్టుగా ఉంది. తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, డిపోల్లో తనిఖీలు చేయకపోవడం వల్లే ఇలాంటివి జరుగుతున్నాయని మద్యం ప్రియులు అంటున్నారు. దీనిపై ఎక్సైజ్ డిపో మేనేజర్ జానకిరామ్‌ను వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని, విచారించి తగు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నివారణ సులభం



మాట్లాడుతున్న హైమావతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 5: క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించడం ద్వారా నివారణ సులభమవుతుందని పద్మావతి యూనివర్సిటీ ఉమెన్ స్టడీస్ ప్రతినిధి హైమావతి పేర్కొన్నారు. మహిళా ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన క్యాన్సర్ అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ ప్రమాదకరమన్నారు. తొలి దశలోనే పరీక్షలు చేసుకుని నివారించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. క్యాన్సర్ నివారణకు టీకాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ భారతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 5: ఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న పద్మావతి వర్సిటీ విద్యార్థినులు స్వాతి, షయ్యద్ హీనాను వీసీ ప్రొఫెసర్ భారతి అభినందించారు. దేశస్థాయిలో నిర్వహించిన వేడుకల్లో యూనివర్సిటీ తరఫున పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు. చదువుతో పాటు విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలని సూచించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.36 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.36 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 70,679 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 21,717 మంది తలనీలాలు సమర్పించారు.

విజయవంతంగా ధార్మిక సదస్సు : భూమన



తిరుమల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలో మూడు రోజుల పాటు జరిగిన ధార్మిక సదస్సు స్వామి ఆశీస్సులతో విజయవంతంగా ముగిసిందని టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ధార్మిక సదస్సు ముగింపులో ఆయన ప్రసంగిస్తూ.. హిందూ ధర్మపరిరక్షణ కోసమే నిర్వహించిన దీనిపై రాజకీయ విమర్శలు చేయవద్దని కోరారు. 2007లో, 2008లో ధార్మిక సదస్సులు నిర్వహించామని, 17 ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు జరిపామని అన్నారు. మూడు రోజులు జరిగిన ఈ సదస్సులో ఎందరో పీఠాధిపతులు, మఠాధిపతులు తమ అమూల్యమైన సూచనలు అందించారన్నారు. ఈవో ధర్మారెడ్డి, టీటీడీ ఉద్యోగుల సహకారంతో సదస్సు సంతృప్తికరంగా ముగిసిందన్నారు.

పీసీసీఎస్ యాప్, వెబ్‌సైట్ ఆవిష్కరణ



పీసీసీఎస్ యాప్, వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 5 : పోలీస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (పీసీసీఎస్) మొబైల్ యాప్, వెబ్‌సైట్‌ను ఎస్పీ పరమేశ్వరరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అయాన్ టెక్నాలజీస్ నేతృత్వంలో యాప్, వెబ్‌సైట్‌ను రూపొందించినట్లు చెప్పారు. జిల్లాలోని పోలీసు సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటరావు, కులశేఖర్, విమలకుమారి, శివరామిరెడ్డి, ఏఓ కిషోర్‌కుమార్, డీఎస్పీలు సురేంద్రరెడ్డి, రవీంద్రారెడ్డి, పోలీస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ కార్యదర్శి చెంగయ్య, సహాయ కార్యదర్శి సోమశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు మీనాక్షి, రామశర్మ, సుబ్బయ్య, జయకుమార్, అయ్యప్ప, విద్యాసాగర్, నవీన్, నగేష్, శారద, అయాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 53 ఫిర్యాదులు

తిరుపతి ప్రకాశం రోడ్డులోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 53 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఏఎస్పీలు కులశేఖర్, విమలకుమారితో కలిసి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిర్యాదుదారులు తమ సమస్యలపై వినతులు అందజేశారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

రూరల్ తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 4: తిరుపతి రూరల్ తహసీల్దార్‌గా మహబూబ్ చాంద్ బాధ్యతలు స్వీకరించారు. తహసీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈమె మదనపల్లె నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. కాగా ఇక్కడి తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యం ఇటీవల బదిలీ అయ్యారు.

టీడీపీ అభ్యర్థిని నేనే

● ఇవే నా చివరి ఎన్నికలు

● సర్వేలోనూ ముందంజలో ఉన్నా : సుగుణమ్మ



మీడియాతో మాట్లాడుతున్న సుగుణమ్మ

తిరుపతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : 'టీడీపీ-జనసేన పొత్తుల్లో భాగంగా తిరుపతి సీటు టీడీపీకి కేటాయిస్తే నేనే అభ్యర్థిని. వయసురీత్యా కూడా ఇవే నాకు చివరి ఎన్నికలు. పార్టీ అధిష్ఠానం దృష్టిలో కూడా నా పేరే ఉంది' అని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.సుగుణమ్మ స్పష్టం చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ నిత్యం ప్రజల్లో ఉంటూ వారి అభిమానం చూరగొన్న తన భర్త దివంగత ఎమ్మెల్యే వెంకటరమణ రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారని గుర్తుచేశారు. ఆయన మరణానంతరం తాను దేశంలోనే అత్యధికంగా లక్షా పదహారువేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో గెలిచానన్నారు. 2019 లోనూ తానే గెలిచానని, చివరి క్షణంలో ఏమి జరిగిందో అందరికీ తెలిసిందేనన్నారు. అప్పటి నుంచి నియోజకవర్గ ఇన్‌చార్జిగా నిత్యం ప్రజల్లోనే ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేశానని తెలిపారు. టీడీపీ-జనసేన పొత్తులో ఇరు పార్టీల అధినేతలు కలిసి నిర్ణయం తీసుకోబోతున్నారన్నారు. ఒకవేళ ఈ సీటు జనసేన పార్టీకి కేటాయిస్తే తాను పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. తమ పార్టీ నిర్వహించిన ఐవీఆర్ సర్వేలో తనకు మెజారిటీ వచ్చిం ది వాస్తవమేనన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ కార్పొరేటర్‌గా పోటీ చేసిన తన మనవరాలు బీవీ కీర్తి పేరును ఇతర ఆశావహులతో కలసి పార్టీనే ప్రతిపాదించిందన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీ దొంగ ఓట్లతో గెలిచిందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లోనైనా ధర్మంగా పోరాటం చేయాలని వైసీపీకి సవాల్ విసిరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఆర్సీ మునికృష్ణ, దంపూరి భాస్కర్, బుల్లెట్ రమణ, మహేష్ యాదవ్, ఊట్ల సురేంద్ర నాయుడు, మునిశేఖర్ రాయల్, పుష్పావతి, సుబ్రమణ్యం, కరాటే చంద్ర, బాలు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న సేవలో ప్రముఖులు



రంజిత్‌రెడ్డి - లక్ష్మీనారాయణన్ - కరాటే కళ్యాణి - నందిత శ్వేత - అప్పలనాయుడు

తిరుమల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో తెలంగాణ ఎంపీ రంజిత్ రెడ్డి, పుదుచ్చేరి మంత్రి లక్ష్మీనారాయణన్, సినీనటులు నందిత శ్వేత, కరాటే కళ్యాణి, ఎమ్మెల్యే అప్పలనాయుడు ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

కరకంబాడి పేదలకు న్యాయం చేయండి



కలెక్టర్ లక్ష్మీశాకు సమస్యను వివరిస్తున్న సీపీఎం నాయకులు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 5: కరకంబాడి పేదలకు న్యాయం చేయాలని కలెక్టర్ లక్ష్మీశాకు సీపీఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఆయనను కలిసి కరకంబాడి ప్రాంతంలో ఇళ్ల స్థలాల కోసం పోరాడుతున్న పేదల గురించి ప్రస్తావించారు. జగనన్న ఇంటి పట్టాలు ఇచ్చినా స్థలం చూపలేదని ఆరోపించారు. అర్హులైన పేదలకు 125 ఎకరాల భూమిని పంచి సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం కరకంబాడి ఇంటిస్థలాల సాధన కమిటీ 3,297 అర్జీలను కలెక్టర్‌కు అందజేసింది. పరిశీలించి ఇంటి స్థలాలు ఇస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కందారపు మురళి, అంగేరి పుల్లయ్య, ఇళ్ల సాధన పోరాట కమిటీ నాయకులు సత్యశ్రీ, రాజశేఖర్, దీప, ఎర్రస్వామి, కుమారి, పవిత్ర, సుధ, మస్తాని, పార్వతి, నూరి, రాధిక, శ్రావణి, జయసుధ తదితులు పాల్గొన్నారు.

అవయవ దానంతో జీవితానికి సార్థకత



సీతామహాలక్ష్మిని సత్కరిస్తున్న వీసీ భారతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 5: అవయవ దానంతో మనిషి తన జీవితానికి సార్థకతను చేకూర్చుకోవడానికి అవకాశం ఏర్పడుతుందని అవయవదాన ఉద్యమకర్త డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పద్మావతి మహిళా యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మరణానంతరం అవయవదానం చేయడానికి మరణానికి ముందే సమ్మతి తెలియజేయాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే వేలాది మందిని అవయవదానం చేసేందుకు సమాయత్తం చేశామన్నారు. ముందుగా రిజిస్టర్ చేసుకున్న వాళ్లు మాత్రమే అవయవదానం చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆమెను వర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి సత్కరించారు.

మర్చిపోయిన బ్యాగు అప్పగింత



తిరుమల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అన్నప్రసాద భవనంలో భక్తులు మర్చిపోయిన బ్యాగును సిబ్బంది తిరిగి అప్పగించారు. హనుమకొండకు చెందిన రజనీకాంత్ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వచ్చారు. సోమవారం మధ్యాహ్నం అన్నప్రసాదాలు స్వీకరించేందుకు వెంగమాంబ అన్నప్రసాద భవనంలోని హాల్ 1లోకి వెళ్లారు. బ్యాగును టేబుల్‌పై పెట్టి మర్చిపోయి వెళ్లిపోయారు. గుర్తించిన సిబ్బంది అధికారులకు అప్పగించారు. కొంత సమయానికి భక్తులు తిరిగి రావడంతో వివరాలు సేకరించి అప్పగించారు. బ్యాగులో సెల్‌ఫోన్, రూ.5 వేల నగదు, దర్శనం టికెట్లు ఉన్నాయని రజనీకాంత్ తెలిపారు.



ఓటు నమోదు, వినియోగంపై అవగాహన



తిరుపతి(విద్య), ఫిబ్రవరి 5 : తిరుపతి రూరల్ మండలం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆడిటోరియంలో సోమవారం తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్, తెలుగు మహిళ ఆధ్వర్యంలో ఓటు నమోదు, వినియోగంపై యువతకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ పేరిట నిర్వహించిన ఈ సదస్సును తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు ప్రారంభించి, మాట్లాడారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నాయో లేదో చూసుకుని వినియోగించాలని కోరారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మంచి నాయకులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి మహేష్‌యాదవ్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కంకణాల రజనీకాంత్ నాయుడు మాట్లాడుతూ ఓటే ఆయుధమని, మంచి ఎమ్మెల్యేను ఎన్నుకుంటే మన ప్రాంతాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తారని వివరించారు. టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షుడు హేమంత్‌రాయల్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కొత్త ఓటర్ల ఓట్లు చాలా కీలకమన్నారు. అనంతరం పలువురు విద్యార్థులు సంధించిన ప్రశ్నలకు రవినాయుడు సమాధానాలిచ్చారు. గేట్ కళాశాల ఛైర్మన్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి ఆర్సీ శ్రీనివాసులు, నాయకులు పత్తిపాటి వివేక్, కుమారమ్మ, తోటవాసు, రంజిత్‌నాయుడు, ఉదయ్‌కుమార్, శ్రీరామ్ బాబి, శరత్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనుల పూర్తికి సహకరించండి

స్పందనలో కమిషనర్‌కు వైసీపీ కార్పొరేటర్ల వినతి

తిరుపతి, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి) : నగరంలోని చాలా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, పూర్తి చేసేలా సహకరించాలని వైసీపీ కార్పొరేటర్లు స్పందనలో కమిషనర్ అదితి సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన డయల్ యువర్ కమిషనర్, స్పందనలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, 25వ డివిజన్ కార్పొరేటర్ నరసింహాచారి, 31వ డివిజన్ కార్పొరేటర్ సి.కె.రేవతి, ఒకటవ డివిజన్ కార్పొరేటర్ ఆదం రాధాకృష్ణారెడ్డి, 50వ డివిజన్ కార్పొరేటర్ అనిల్‌కుమార్ హాజరై డివిజన్ పరిధిలోని సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు. ఆర్సీ రోడ్డు అండర్ పాస్‌పైన కర్నాలవీధి, కస్తూరిబాయి వీధిని కలిపే ర్యాంప్ నిర్మాణాన్ని పట్టించుకోవడంలేదని నరసింహాచారి ఫిర్యాదు చేశారు. 31వ డివిజన్లో రోడ్లు నిర్మించాలని కార్పొరేటర్ రేవతి కోరారు. రోడ్డు విస్తరణలో భాగంగా స్థలాలు కోల్పోయిన వారికి టీడీఆర్ బాండ్లు జారీ చేయాలని కార్పొరేటర్ అనిల్ కమిషనర్‌కు విన్నవించారు. అదేవిధంగా డయల్ యువర్ కమిషనర్‌కు 9 ఫిర్యాదులు, స్పందనకు 34 ఫిర్యాదులు వచ్చాయి.



సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధించకపోతే చర్యలు : కమిషనర్

తిరుపతి మున్సిపల్ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం పాటించకపోతే తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ అదితి సింగ్ హెచ్చరించారు. సోమవారం ఉదయం మస్టర్ పాయింట్లను ఆమె పరిశీలించారు. లక్ష్మీపురం సర్కిల్ వద్దగల ఓ బారులో ప్లాస్టిక్ గ్లాసులు విక్రయిస్తూ కనిపించడంతో రూ.5వేలు జరిమానా విధించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులు అమ్మినా, వినియోగించినా తగు చర్యలు తీసుకుంటామన్నారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి ఆమె వెంట ఉన్నారు.

ఆగని గ్రావెల్, ఇసుక తవ్వకాలు


శిరసనంబేడులో గ్రావెల్ తవ్వకాలతో ఏర్పడిన గోతులు

పెళ్లకూరు, ఫిబ్రవరి 5: పెళ్లకూరు మండలంలో గ్రావెల్, ఇసుక తవ్వకాలు యధేచ్ఛగా సాగుతున్నాయి. ప్రభుత్వ భూములు, స్వర్ణముఖినది నుంచి గ్రావెల్, ఇసుకను తోడేస్తున్నారు. మండలంలో పుల్లూరు నుంచి తాళ్వాయి పాడు వరకు సుమారు 20 కిలోమీటర్ల మేర స్వర్ణముఖినది ప్రవహిస్తుంది. అదే విధంగా రోసనూరు, శిరసనంబేడు, బంగారంపేట, సీఎన్‌పేట తదితర గ్రామాల్లో ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ లభిస్తుంది. నాయుడుపేట - రేణిగుంట జాతీయ రహదారి విస్తరణ పనుల పేరిట రాత్రి, పగలు తేడా లేకుండా వందలాది వాహనాల ద్వారా గ్రావెల్, ఇసుక ఇతర అవసరాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా బహిరంగ రహస్యమే అయినప్పటికీ అధికార పార్టీకి చెందిన ఓ ముఖ్యనేత భాగస్వామ్యం కావడంతో అధికారులు మౌనం వహిస్తున్నారు. వివిధ ప్రభుత్వ భవనాలతో పాటు పక్కా గృహాల నిర్మాణాలకు స్వర్ణముఖినది నుంచి ఇసుక, నాయుడుపేట - రేణిగుంట జాతీయ రహదారి విస్తరణ పనుల కోసం గ్రావెల్ తరలించేందుకు అధికారులు అనుమతులు ఇస్తున్నారు. దీన్ని అడ్డం పెట్టుకొని అక్రమార్కులు తవ్వకాలు జరుపుతున్నారు. యడకూడి, పుల్లూరు, కలవకూరు, ముమ్మారెడ్డిగుంట, పెన్నేపల్లి, తాళ్వాయిపాడు తదితర ప్రాంతాల నుంచి ఇసుకను తరలిస్తుండటంతో భూగర్భజలాలు అడుగంటి తాగు, సాగునీటికి ఇబ్బందులు ఎదురవుతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా నందిమాల, చెన్నప్పనాయుడుపేట, బంగారంపేట, శిరసనంబేడు, రోసనూరు తదితర ప్రాంతాల నుంచి గ్రావెల్‌ను తరలిస్తున్నారు. ఉన్నతాధికారులుస్పందించి గ్రావెల్, ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సిద్ధవైద్యం ప్రాముఖ్యత ప్రపంచానికి తెలియాలి

శ్వేత డైరెక్టర్ భూమన సుబ్రహ్మణ్యం రెడ్డి


ద్విచక్రవాహనాలపై బయల్దేరిన సిద్ధవైద్య నిపుణులు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 5: సిద్ధులు, రుషులు, జ్ఞానులు మనకు ఇచ్చిన ఆరోగ్య సంపదల్లో సిద్ధ వైద్యం ప్రధానమైందని, అంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ వైద్యం ప్రపంచానికి తెలియాల్సిన అవసరముందని శ్వేత డైరెక్టర్ భూమన సుబ్రహ్మణ్యం రెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరూ సిద్ధ వైద్యం పొందాలనే ఉద్దేశంతో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సిద్ధ చెన్నై వారు ద్విచక్ర వాహనాలపై ఢిల్లీ టూ కన్యాకుమారి కార్యక్రమానికి గత నెల 24న ఢిల్లీలో శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా వీరు సోమవారం తిరుపతిలోని శ్వేత భవనానికి చేరుకున్నారు. శ్వేత డైరెక్టర్ భూమన సుబ్రహ్మణ్యం వీరికి స్వాగతం పలికి అభినందించారు. టీటీడీ సిబ్బందికి సిద్ధవైద్యం మందుల కిట్లను అందించారు. ఈ కార్యక్రమంలో సిద్ధ వైద్య సిబ్బంది రాజ్యలక్ష్మి, షెన్‌బగవల్లి, ముత్తుకుమరన్ పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.36 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.36 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 70,679 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.


ధాన్యం బస్తాలను ట్రాక్టర్‌కు ఎత్తుతున్న కూలీలు

ధాన్యం ధరలు తగ్గుముఖం

● ఆవేదనలో రైతన్న

పెళ్లకూరు, ఫిబ్రవరి 5: రబీ సీజన్‌లో సాగుచేసిన వరి పంటల కోతలు ప్రారంభమయ్యాయి. వారం కిందట బీపీటీ 5204 రకం 75 కిలోల బస్తా రూ.2100 ధర పలికింది. ప్రస్తుతం రూ.1900కి పడిపోయింది. అలాగే ఆర్ఎన్ఆర్ 15048 రకం రూ.2300 నుంచి రూ.2100కి, కేఎన్ఎం 1638 రకం రూ.2150 నుంచి రూ.2000కి, ఎన్ఎల్ఆర్ 34449 రకం రూ.1,650 నుంచి రూ.1400కి, ఎంటీయూ 1010 రకం 75 కిలోల బస్తా రూ.1650 నుంచి రూ.1400కు తగ్గిపోయింది. మరోవైపు దిగుబడులు కూడా ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు ఈప్రాంత రైతులు మన రాష్ట్రంలో ధరలు తగ్గాయనుకుంటే తమిళనాడు, కర్ణాటకలకు ఎగుమతులు చేసి లాభాలు గడించేవారు. ప్రస్తుతం దేశమంతా ఒకే పన్ను కిందకు రావడంతో మిల్లర్లంతా జాతీయ స్థాయిలో సిండికేట్‌గా మారుతున్నారు. దీనివల్ల ఎక్కడికి పోయినా ప్రయోజనం ఉండటం లేదని రైతులు చెబుతున్నారు.

కొనుగోలు కేంద్రాలెక్కడ?

ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ఇవి లేకపోవడంతో దళారుల దోపిడీకి గురవుతున్నామని చెబుతున్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

కళాశాల అభివృద్ధికి కృషి

గూడూరు, ఫిబ్రవరి 5: దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కళాశాల కమిటీ నూతన అధ్యక్షుడిగా ఎంపికైన మారంరెడ్డి శివకుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం డీఆర్‌డబ్ల్యూ కళాశాల యాజమాన్య కమిటీ నూతన సభ్యులను ఎంపిక జరిగింది. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ మెహర్‌మణి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా ఉన్న అల్లారెడ్డి రవికుమార్‌రెడ్డి ఇటీవల మృతిచెందడంతో నూతన అధ్యక్షుడుగా మారంరెడ్డి శివకుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడుగా డాక్టర్ జనార్దనరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కోశాధికారి విద్యాసాగర్, ప్రిన్సిపాల్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.


శివకుమార్‌రెడ్డిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

నాడు ప్రథమం...

నేడు అధమం

- నష్టాలబాటలో సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో
- కొత్త బస్సులు రాకపోగా.. ఉన్నవీ రద్దు
- పల్లె వెలుగు సర్వీసులకే పరిమితం


సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 5: ఉమ్మడి నెల్లూరు జిల్లాలో అత్యంత ప్రాధాన్య కలిగిన సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న ఈ డిపోను 1999 ఏప్రిల్ 16న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. మూడేళ్లు వరుసగా మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి కైవసం చేసుకుంది. 2007, 2009లోనూ కోటి రూపాయల ఆదాయంతో ప్రథమ స్థానంలో నిలిచింది. అలాంటిది ప్రస్తుతం మూడు కోట్ల మేరకు నష్టాల్లో నడుస్తూ 120వ ర్యాంక్‌తో రాష్ట్రంలో చివరి స్థానంలో ఉంది. ఒకప్పుడు సూళ్లూరుపేట డిపో నుంచి బెంగళూరు, హైదరాబాదు, కడప, మదనపల్లె, ద్రాక్షరామం, తిరుమల, కావలి ప్రాంతాలకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడిచేవి. రాబడి కూడా బాగా వచ్చేది. గతంలో 49 సర్వీసులు ఉన్న డిపోలో నేడు 25 మాత్రమే ఉన్నాయి. ఇవి కాకుండా అద్దె బస్సులు ఏడు నడుస్తున్నాయి. మిగిలిన సర్వీసులను ఇతర డిపోలకు తరలించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు వచ్చి సర్వీసులు అడిగినా బస్సులు పంపే స్థితిలో అధికారులేరంటే డిపో పరిస్థితి ఏమిటో ఇట్టే తెలుస్తోంది. సూళ్లూరుపేట నుంచి జిల్లా కేంద్రమైన తిరుపతికి ఒకప్పుడు అరగంటకు ఒక బస్సు ఉండేది. ప్రస్తుతం 5 బస్సులు మాత్రమే తిరుపతి మార్గంలో తిరుగుతున్నాయి. అదే విధంగా సూళ్లూరుపేట - కోట మార్గంలో ప్రతి గంటకు ఒక బస్సు తిప్పేవారు. ఆ మార్గంలోనూ ఇదే పరిస్థితి. ఉన్న అరకొర సర్వీసులను అధికారులు ఏదో ఒక కారణంతో తరచూ రద్దు చేస్తున్నారు. ఇక సూళ్లూరుపేట నుంచి తడ మీదుగా నడిచే బస్సులను పూర్తిగా రద్దుచేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించుకొన్న పట్టించుకోలేదు. ప్రస్తుతం ఆయా మార్గాల్లో తమిళనాడు బస్సులు తిరుగుతున్నాయి. షార్ ఉద్యోగుల కోసం సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోట - బెంగళూరు మధ్య రెండు సర్వీసులు నడిపేవారు. అలాగే తిరుమలకు సర్వీసులు ఉండేవి. ప్రస్తుతం ఒక బస్సు కూడా తిప్పడం లేదు. బెంగళూరు, హైదరాబాద్, తిరుమలకు బస్సులు నడపాలని ప్రజలు, ఇస్రో ఉద్యోగులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అయితే కర్ణాటక ఆర్టీసీ మాత్రం శ్రీహరికోటకు బస్సు నడుపుతుండడం గమనార్హం. ఒకప్పుడు లాభాల్లో నడుస్తూ బహుమతులు అందుకున్న డిపో నేడు నష్టాల బాట పట్టడానికి పాలకులతో పాటు అధికారులు కూడా కారణమని చెప్పాలి. ఆదాయ మార్గాల్లో అదనపు సర్వీసులు నడపకపోగా ఉన్నవీ రద్దు చేయడం, ప్రయాణికులు కోరినా బస్సులను తిప్పడంలేదు. ముఖ్యంగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డిపో పరిస్థితి మరింత దిగజారిపోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైన డిపో అధికారులు స్పందించి దూర ప్రాంతాలకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులతో పాటు ప్రయాణికుల రద్దీ ఉన్న మార్గాల్లో బస్సులు నడిపితే నష్టాలనుంచి గట్టెక్కించవచ్చు.

'నవ' స్పందన

● కూర్చోబెట్టి అర్జీల స్వీకరణ


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 5: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో అత్యధికంగా భూ సమస్యలపై 153మంది ఫిర్యాదు చేశారు. మొత్తంగా వివిధ శాఖలకు సంబంధించి 201 అర్జీలు అందాయి. జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచలకిషోర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అర్జీలు స్వీకరించారు. కాగా.. కొత్త కలెక్టర్ లక్ష్మీశ, స్పందనలో కొన్ని మార్పులు చేశారు. అధికారుల ముందు గుంపులు లేకుండా, అందరినీ కుర్చీల్లో కూర్చొనేలా ఏర్పాటు చేశారు. టోకెన్‌లు కేటాయించి, ప్రతి ఒక్కరి సమస్యనూ సావధానంగా విన్నారు. అర్జీలు రాయడం రానివారి కోసం ముఖద్వారం దగ్గరే కొంతమందిని నియమించి, అర్జీ రాయించే ఏర్పాటు చేశారు.

ప్రభుత్వం ఇచ్చిన స్థలంపై వైసీపీ నేతల దౌర్జన్యం



రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ తారకరామనగర్‌లో ప్లాట్ నెంబరు2675ను అప్పటి ప్రభుత్వం మాకు కేటాయించింది. ఆ స్థలంలో ఇల్లు కూడా కట్టుకున్నాం. అయితే ఇటీవల అదే ప్లాట్‌ను రేణిగుంట తహసీల్దారు తమకు కేటాయించారంటూ వైసీపీ వారు మా ఇంటి వద్దకు వచ్చి దౌర్జన్యం చేస్తున్నారు.

- మంగమ్మ, కరకంబాడి

విశ్వకర్మలకు అవమానం



18 రకాల చేతివృత్తుల వారికి చేయూతనివ్వడానికీ, వారి ఆత్మ గౌరవం పెంచేందుకూ ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన ప్రవేశ పెడితే, రాష్ట్ర ప్రభుత్వం ఆ పథకాన్ని నీరుగారుస్తోంది. దాన్ని సక్రమంగా అమలు చేయాలి. సచివాలయాల దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నారు.

- కలెక్టరేట్ వద్ద నిరసనలో బీజేపీ నేతలు

మోసం జగన్!



జిల్లాలో సివిల్ సప్లయీస్ హమాలీ కార్మికులకు జీతాలు సరిగా అందడంలేదు. చనిపోయిన వారికి పీఎఫ్ డబ్బులు ఖాతాలో జమ కావడంలేదు. ఈ ప్రభుత్వం దగా చేస్తోంది. ఐదేళ్లుగా జగన్‌రెడ్డి ప్రభుత్వం మోసపూరిత హామీలు ఇస్తోంది. ఇప్పటికైనా మా సమస్యలు పరిష్కరించండి.

- కలెక్టరేట్ వద్ద ఆందోళనలో సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సివిల్ సప్లయీస్ కార్మికసంఘం నేతలు అయ్యప్ప, సురేష్, చెంచయ్య, పాండు

దగా డీఎస్సీ మాకొద్దు.. మెగా డీఎస్సీ కావాలి..!

విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నగరంలో పోరుబాట


ర్యాలీ నిర్వహిస్తున్న డీఎస్సీ అభ్యర్థులు, యువజన సంఘాల నేతలు

తిరుపతి(విద్య),ఫిబ్రవరి 5: రాష్ట్రంలో డీఎస్సీ నోటిఫికేషన్ కోసం నాలుగన్నరేళ్లుగా ఆశగా ఎదురుచూసిన నిరుద్యోగులకు ప్రభుత్వం తూతూమంత్రంగా పోస్టులను విడుదల చేసి నిరాశపరచిందని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.జయచంద్ర పేర్కొన్నారు. డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో ఆందోళన చేపట్టారు. అన్నమయ్యసర్కిల్‌లో రాస్తారోకో నిర్వహించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్కడి నుంచి ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. ఆర్డీవో కార్యాలయం లోపలకు చొచ్చుకుపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కొంతసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. జయచంద్ర మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సెకండరీగ్రేడ్ టీచర్ పోస్టులు కేవలం 8 మాత్రమే ఉండగా.. 8 జిల్లాల్లో ఎస్‌జీటీ పోస్టుల సంఖ్య సున్నగా ఉందని పేర్కొన్నారు. ప్రాథమిక విద్యను బోధించే ఎస్‌జీటీ టీచర్ పోస్టులను అరకొరగా కేటాయించడం దుర్మార్గమన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ సీఎం జగన్ ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు చలపతి మాట్లాడుతూ డీఎస్సీ నోటిఫికేషన్‌ను సవరించి 25వేల పోస్టులతో ప్రకటించాలన్నారు. డీఎస్సీ అభ్యర్థులు నవీన్, కార్తీక్, హరినాథ్, ప్రశాంత్, విద్యార్థినాయకులు అక్బర్, సురేష్, ఉదయ్, హరి, అశోక్, శివ,పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వహించాలి


మాట్లాడుతున్న డీఆర్వో పెంచలకిషోర్

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 5: సార్వత్రిక ఎన్నికల్లో వివిధ శాఖల నోడల్ అధికారులు తమకు కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వహించాలని డీఆర్వో పెంచలకిషోర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో చిన్న పొరపాటు జరిగినా భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎన్నికల ఏర్పాట్లపై నోడల్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు.

రేపటి నుంచి రుయాలో కార్డియో థోరాసిక్ సేవలు ప్రారంభం

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 5: రుయాస్పత్రిలో రోగులకు కార్డియో థోరాసిక్ ఓపీ సేవలను అందుబాటులోకి తీసుకువస్తుండటం గొప్ప విషయమని సూపరింటెం డెంట్ రవిప్రభు అన్నారు. రుయాస్పత్రి కార్డియో థోరాసిక్ విభాగాధిపతిగా డాక్టర్ కళ్యాణి రమ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె విజయవాడలోని సిద్ధార్థ వైద్య కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. సూపరింటెండెంట్ రవిప్రభు స్వాగతం పలికి, బాధ్యతలు అప్పజెప్పారు. కొన్నేళ్లుగా కార్డియో థోరాసిక్ సేవలు అందుబాటులో లేక రోగులు ఎంతగానో ఇబ్బంది పడుతున్నారని, ఇకపై ఓపీ నంబర్ 20వ గదిలో బుధ, శనివారాల్లో సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. డాక్టర్ కళ్యాణి రమను ఏఆర్ఎంవో డాక్టర్ హరికష్ణ, సిబ్బంది చిరంజీవి, షాహీద అభినందించారు.

యువతను సన్మార్గంలో నడిపించాలి

ప్రతి గ్రామంలో ఆలయాలు నిర్మించాలి

చివరి రోజు ధార్మిక సదస్సులో పీఠాధిపతులు

తిరుమల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లలకు భగవంతుడిపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఊరిలోనూ వారానికి ఒకసారి ప్రవచనాలు, ప్రార్థన గురించి తెలిపాలని ఉడిపి మఠాధిపతి వేదవర్ధన పేర్కొన్నారు. అదే సమయంలో యువతను సన్మార్గంలో నడిపించడానికి కృషి చేయాలన్నారు. తిరుమల ఆస్థానమండపంలో మూడు రోజుల పాటు జరిగిన ధార్మిక సదస్సు సోమవారం ముగిసింది. చివరి రోజు పలువురు స్వామిజీలు అనుగ్రహభాషణం చేశారు. శ్రీరంగంలోని పౌండరికపురం ఆశ్రమానికి చెందిన పరవకొట్టై చిన్న ఆండవన్ శ్రీనివాస గోపాల మహాదేశికన్ మాట్లాడుతూ ధర్మప్రచారంలో భాగంగా టీటీడీ పాఠశాలలు, కళాశాలల్లో పిల్లలకు నైతిక పోటీలు నిర్వహించి, మన సంప్రదాయాలను కొనసాగించాలన్నారు. వేదాలను దేశమంతా ప్రచారం చేయాలన్నారు. వారణాశిలోని బ్రహ్మానంద మఠాధిపతి సదాశివ మాట్లాడుతూ.. సంస్కృత సుభాషితాలు, విష్ణుసహస్రనామ పారాయణం ప్రత్యేకంగా బోధించాలన్నారు. రాఘవేంద్ర మఠాధిపతి సువిద్యేంద్ర తీర్థ మాట్లాడుతూ టీటీడీ వేదపరిరక్షణ చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వేద పరిరక్షణే ధర్మపరిరక్షణ అన్నారు. గోసంరక్షణ ఆవశ్యకత చాలా ఉందన్నారు. ప్రతి గ్రామంలో దేవాలయాలు నిర్మించాలన్నారు.

మర్చిపోయిన బ్యాగు అప్పగింత

తిరుమల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అన్నప్రసాద భవనంలో భక్తులు మర్చిపోయిన బ్యాగును సిబ్బంది తిరిగి అప్పగించారు. హనుమకొండకు చెందిన రజనీకాంత్ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వచ్చారు. సోమవారం మధ్యాహ్నం వెంగమాంబ అన్నప్రసాద భవనంలోని హాల్‌లోకి వెళ్లారు. బ్యాగును టేబుల్‌పై పెట్టి మర్చిపోయి వెళ్లిపోయారు. గుర్తించిన సిబ్బంది అధికారులకు అప్పగించారు. కొంత సమయానికి భక్తులు తిరిగి రావడంతో వివరాలు సేకరించి అప్పగించారు.

రేపు 'శ్రీవేంకటేశ్వర నవరత్న మాలిక'

తిరుమల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): టీటీడీ దాససాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో కర్ణాటక సంగీత పితామహుడు పురందరదాసు ఆరాధాన మహోత్సవాలు బుధవారం నుంచి10వ తేదీ వరకు తిరుమల ఆస్థానమండపంలో నిర్వహించనున్నారు. తొలిరోజు కల్యాణ వేదికలో రాత్రి 7 గంటలకు యువ కళాకారులతో 'శ్రీవేంకటేశ్వర నవరత్న మాలిక' గోష్ఠిగానం నిర్వహించనున్నారు. పురందరదాసు రచించిన 4.75లక్షలకు పైగా సంకీర్తనల్లో ప్రధానమైన తొమ్మిదింటిని 300మంది సుప్రసిద్ధ కళాకారులు గోష్ఠిగానం చేస్తారు.

బీవీబీలో నేడు, రేపు సైన్స్ టీచర్లకు శిక్షణ

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 5: తిరుపతిలోని భారతీయ విద్యాభవన్స్‌లో మంగళ, బుధవారాల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో(చిత్తూరు, తిరుపతి) ప్రభుత్వ పాఠశాలలో పని చేసే దాదాపు 80మంది సైన్స్ టీచర్లకు ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ నిర్వహిస్తున్నట్లు జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ పేర్కొన్నారు. ఐసర్(తిరుపతి), రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ(ఆర్ఎస్సీ), ఇన్నోవేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్(ఐఎస్‌టీఎఫ్), భారతీయ విద్యాభవన్స్ సంయుక్త ఆధ్వర్యంలో రసాయనశాస్త్ర బోధనలో నైపుణ్యాల పెంపుకు ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

టీటీడీకి విరాళంగా ద్విచక్ర వాహనం

తిరుమల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి సోమవారం ఓ ద్విచక్ర వాహనం విరాళంగా అందింది. బిగాస్ సంస్థ ప్రతినిధులు రూ.1.20లక్షల విలువైన విద్యుత్ ద్విచక్ర వాహనాన్ని విరాళంగా ఇచ్చారు. సోమవారం ఆలయం ముందు పూజలు నిర్వహించి తాళాలు అందజేశారు.

మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా భాస్కర్



పుత్తూరు, ఫిబ్రవరి 5: పుత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి కొత్త కార్యవర్గాన్ని ప్రభుత్వం ప్రకటించింది. చైర్మన్‌గా భాస్కర యాదవ్‌కు మరోమారు అవకాశం కల్పించింది. అలాగే వైస్ చైర్మన్‌గా శేఖర్‌తో పాటు 18మంది సభ్యులను నియమించింది. ఇందులో జ్యోతి, శశికళ, సుభాషిణి, గౌరి, వడివేలు, పద్మావతి, సుదర్శనవర్మ, సెల్వి, వరప్రసాద్, ప్రభావతి, జయరామ్, గోపాల్, పెరుమాళ్‌తో పాటు ముగ్గురు ప్రభుత్వ అధికారులు ఉన్నారు. వీరందరి పదవీ కాలం రెండేళ్లు. తనను మళ్లీ అధ్యక్షుడిగా నియమించేందుకు కృషి చేసిన మంత్రి రోజాకు భాస్కర్‌యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

పెండింగ్ జీతాలు చెల్లించండి


ధర్నా చేస్తున్న కార్మికులు

నారాయణవనం, ఫిబ్రవరి 5: పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ నాయకుడు చిన్నిరాజ్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు 24నెలల జీతాలు ఇవ్వకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని వాపోయారు. కార్యక్రమంలో అన్నాదొరై, మునిచంద్ర, దాసు, చెంగయ్య, సుభాష్, విజయన్, మునిచంద్ర, ఆనందన్, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

ఇసుక ట్రాక్టర్ల సీజ్

నారాయణవనం, ఫిబ్రవరి 5: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. సోమవారం కీళగరం వద్ద ఉన్న అరుణానదిలో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లును పోలీసులు అడ్డుకుని, స్వాధీనం చేసుకున్నారు. గత కొన్ని నెలలుగా అరుణానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని గ్రామస్తులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు నిఘా ఏర్పాటు చేసి, ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఇసుక ట్రాక్టర్ల యజమాని, స్థానిక వైసీపీ నేత ఊరప్ప, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు.

నారాయణవనం తహసీల్దార్‌గా శంకర్‌రావు



నారాయణవనం, ఫిబ్రవరి 5: తహసీల్దార్‌గా శంకర్‌రావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ప్రమీలా కడప జిల్లాకు బదిలీ అయ్యారు. అదే జిల్లాలో పనిచేస్తున్న శంకర్‌రావు ఇక్కడకు వచ్చారు.

సచివాలయంలో రిజిస్ట్రేషన్లు ప్రారంభం


వార్డు సచివాలయంలో రిజిస్ట్రేషన్ల పనితీరును పరిశీలిస్తున్న కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 5: ఎంపిక చేసిన వార్డు సచివాలయాల్లో ఆస్తి రిజిస్ట్రేషన్ సేవలను ప్రారంభించినట్లు కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి తెలిపారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని కల్యాణపురం, ఎన్‌జీవో కాలనీ, సత్యనారాయణపురం వార్డు సచివాలయాల పరిధిలో రిజిస్ట్రేషన్ సేవల పనితీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తొలి విడతగా పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా లబ్ధిదారులకు అందించిన పట్టాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లను చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకుగాను ఎలాంటి సేవా రుసుం వసూలు చేయడం లేదని వివరించారు. తొలిసారి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కాకుండా వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలకు ప్రభుత్వం అనుమతివ్వడంతో లబ్ధిదారులు ఇబ్బందులు లేకుండా సేవలను పొందుతున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని ఎలాంటి ఫీజులు లేకుండానే రిజిస్ట్రేషన్లు చేయించుకోవచ్చని తెలిపారు.

క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నివారణ సులభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 5: క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించడం ద్వారా నివారణ సులభమవుతుందని పద్మావతి యూనివర్సిటీ ఉమెన్ స్టడీస్ ప్రతినిధి హైమావతి పేర్కొన్నారు. మహిళా ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన క్యాన్సర్ అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తొలి దశలోనే పరీక్షలు చేసుకుని నివారించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. క్యాన్సర్ నివారణకు టీకాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


శరవణన్ (ఫైల్‌ఫొటో)

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 5: ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన సంఘటన పుత్తూరులో జరిగింది. మృతుడి కుటుంబసభ్యుల కథనం మేరకు.... గేటు పుత్తూరు పరిధిలోని శీలకారవీధికి చెందిన ఎంఈ. గుణశేఖర్ కుమారుడు ఎంజీ. శరవణన్(28) నేత వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం తిరుమలకుప్పానికి చెందిన తన స్నేహితుడు నరేష్‌తో కలిసి సోమవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై నగరికి బయలుదేరాడు. నందిమంగళం క్రాస్ వద్దకు చేరుకోగానే గుర్తు తెలియని వాహనం వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో శరవణన్ అక్కడికక్కడే మృతి చెందగా, నరేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రథమ చికిత్స అనంతరం నరేష్‌ను తిరుపతి రుయాకు తరలించారు.

పోలీసు స్పందనకు 53 ఫిర్యాదులు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 5: తిరుపతి ప్రకాశం రోడ్డులోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 53 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఏఎస్పీలు కులశేఖర్, విమలకుమారితో కలిసి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిర్యాదుదారులు తమ సమస్యలపై వినతులు అందజేశారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

శ్రీకాళహస్తి డీఎస్పీగా మల్లీశ్వర్ రెడ్డి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 5: శ్రీకాళహస్తి డీఎస్పీగా మల్లీశ్వర్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు పోలీస్ శాఖ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు నుంచి బదిలీపై రానున్న మల్లీశ్వరరావు రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. కాగా ఇక్కడ డీఎస్పీగా పనిచేసిన భీమారావు పదోన్నతిపై బదిలీ అయిన విషయం తెలిసిందే.

అన్నప్రసాదం నాణ్యత, రుచిలో రాజీ వద్దు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 5: అన్నప్రసాదం నాణ్యత, రుచిలో రాజీ వద్దని ముక్కంటి ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు సిబ్బందికి సూచించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే నిత్యాన్న దానంలో సోమవారం ఆయన భక్తులతో కలిసి అన్నదానం స్వీకరించారు. భక్తులు కోరినంత భోజనం వడ్డించాలని ఆదేశించారు.

స్టెప్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు



బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 5: స్టెప్స్ సంస్థ వారి ఆధ్వర్యంలో అపోలో సంస్థ ఛైర్మన్ పద్మ విభూషణ్ డాక్టర్ ప్రతాప్ చంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా మండలం లోని తిమ్మా భూపాల పురం పాఠశాల విద్యార్థులకు సోమవారం డాక్టర్ ప్రమీలమ్మ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విద్యార్థులకు డెంగ్యూ, టైఫాయిడ్, వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాతమ్మ, సంస్థ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, సిబ్బంది గాయత్రి, రోజా, కళావతి, సురేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 5: విద్యార్థులు క్రీడల్లో కూడా రాణించాలని ప్రధానోపాధ్యాయులు రమణయ్య అన్నారు. వరదయ్యపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొండిలైజ్ సహకారంతో 6, 7, 8వ తరగతి విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, స్పోర్ట్స్ డ్రెస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ దర్శకులు బందిలికుమార్, రమేష్, మ్యాజిక్ బస్సు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ సుమంత్, కోచ్ కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృత్యుంజయుడికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 5: శ్రీకాళహస్తీశ్వ రాలయంలో మృత్యుంజయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసం సోమవారం పురస్కరించుకొని మృత్యుంజయ సన్నిధిని అర్చకులు శుద్ధి చేశారు. అనంతరం భక్తుల నుంచి సంకల్పం స్వీకరించారు. వివిధ పూజా ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా అభిషేకించారు. వేద మంత్రాలతో ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వినియోగదారుల హక్కులను కాపాడుకుందాం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 5: తిరుపతి నూతన కలెక్టరు లక్ష్మీషాను సోమవారం శ్రీకాళహస్తికి చెందిన జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ ఏపీ డిప్యూటీ ఛైర్మన్ యల్లంపాటి కోటేశ్వరబాబు మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టరుకు పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మెరుగైన సేవల కోసం సహకారం అందించాలని కలెక్టరును కోరారు.

ముక్కంటి సేవలో కనకదుర్గమ్మ ఆలయ ఛైర్మన్



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 5: ముక్కంటి ఆలయాన్ని సోమవారం విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ ఛైర్మన్ కర్నాటి రాంబాబు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు అయనకు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు శేష వస్త్రంతో సత్కరించి వేద ఆశీర్వాదం అందజేశారు.

ఇంటింటికీ టీడీపీ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 5: శ్రీకాళహస్తి మండలంలోని నారాయణపురం, పెంకులపాడు గ్రామాల్లో టీడీపీ నాయకురాలు బొజ్జల రిషితారెడ్డి పర్యటించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని ఇంటింటా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కామేష్ యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జి బత్తిరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి బత్తెయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీసిటీలో కేంద్ర పర్యావరణ, అటవీశాఖ అధికారులు



అధికారులకు శ్రీసిటీ వివరాలు తెలియజేస్తున్న ప్రతినిధులు

శ్రీసిటీ, ఫిబ్రవరి 5: చెన్నైలోని పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ(ఎంఈఎఫ్, సీసీ) ప్రాంతీయ కార్యాలయానికి చెందిన డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్టు(డీడీజీఎఫ్) డాక్టర్ వి.జార్జ్ జెన్నర్, ఐఎఫ్ఎస్ సోమవారం శ్రీసిటీని సందర్శించారు. వీరితోపాటు యువరాజు, ఐఎఫ్ఎస్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్టు(డీఐజీఎఫ్) చెన్నై, బాలాజీ, ఐఎఫ్ఎస్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్టు(ఏఐజీఎఫ్), ఇంటిగ్రేటెడ్ రీజనల్ ఆఫీస్(ఐఆర్‌వో) విజయవాడ, రామాయపట్నం పోర్టు మేనేజింగ్ డైరెక్టర్ పి.ప్రతాప్‌రెడ్డి ఉన్నారు. వీరికి శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికి, బిజినెస్ సిటీ ముఖ్య అంశాలను తెలియజేశారు. పారిశ్రామిక పార్కు కర్బన్ శూన్యత స్థితిని అందుకోవడానికి అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరిస్తూ, పారిశ్రామిక వృద్ధి, సుస్థిరత మధ్య సంపూర్ణ సమన్వయంతో ప్రపంచ స్థాయి వ్యాపార కేంద్రాన్ని నిర్మించడమే తమ లక్ష్యమని తెలిపారు. శ్రీసిటీలో ప్రకృతికి ఇస్తున్న ప్రాధాన్యంపై డాక్టర్ జార్జ్ జెన్నర్ ప్రశంసించారు. సన్నారెడ్డి కృషిని కొనియాడుతూ చెన్నైకి అత్యంత సమీపంలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతో చక్కటి ప్రణాళికతో కూడిన నగరాన్ని చూడడం ఆశ్చర్యంగా ఉందని అన్నారు. అలాగే దేశ, విదేశాలకు చెందిన వివిధ పరిశ్రమలకు అన్ని సదుపాయాలను కల్పించి, వేలాది మంది స్థానిక ప్రజలకు జీవనోపాధిని కల్పించడం స్ఫూర్తిదాయకంగా ఉందని వ్యాఖ్యానించారు. అనంతరం అధికారులంతా వివిధ ప్రదేశాల్లో పర్యటించాక, ఇసుజు మోటార్స్ ఉత్పత్తి యూనిట్‌ని కూడా సందర్శించారు.

ఎస్ఈకి సన్మానం

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 5: గోపాల్‌రావు కాలనీలో సమస్యలు పరిష్కరించినందుకు విద్యుత్‌శాఖ ఎస్ఈ కృష్ణారెడ్డికి వైసీపీ మండల యువత అధ్యక్షుడు వినోద్ కుమార్‌యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల వర దయ్యపాళెంలో ఎస్ఈ పర్యటించారు. ఆ సందర్భంగా కాలనీలో విద్యుత్ సమస్యలను ఆయనకు వివరించారు. ప్రత్యక్షంగా పరిశీలించిన ఎస్ఈ వెంటనే కాలనీకి 30 విద్యుత్ స్తంభాలు, ఒక ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేశారు. తక్షణమే అమర్చాలని ఆదేశించారు. వాటిని అమర్చారు. దీంతో ఆయన్ను సన్మానించారు. అనంతరం పాండూరు, శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లో పర్యటించి వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.విద్యుత్‌శాఖ అధికారులు చంద్రనాయక్, కృష్ణారెడ్డి, చిన్నరెడ్డెప్పరెడ్డి, హరీష్, శివశంకర్ పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం..ఒకరి అరెస్టు



బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 5: బాపట్లకు చెందిన భార్గవ్ మద్యం తరలిస్తుండగా మండల కేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అతడి నుంచి 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ వెంకటనరసింహ కేసు నమోదు చేశారు.

వైసీపీలో చేరిక

ఏర్పేడు, ఫిబ్రవరి 5: ముసలిపేడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, అనుచరులు సోమవారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మునస్వామి, మహేష్, జగదీష్, మునెమ్మ, రాణెమ్మ, శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

మర్రిమందలో వైసీపీ ఎన్నికల ప్రచారం

ఏర్పేడు, ఫిబ్రవరి 5: ఏర్పేడు మండలం మర్రిమంద గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి సోమవారం ప్రారంభించారు. ప్రతి గడపకు వెళ్లి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కిషోర్‌రెడ్డి, తిరుమలయ్య, మస్తాన్, సుధీర్ పాల్గొన్నారు.

ఏర్పేడు తహసీల్దారు బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ ఉదయ్‌భాస్కర్‌రాజు

ఏర్పేడు, ఫిబ్రవరి 5: ఏర్పేడు మండల తహసీల్దారుగా డి.ఉదయ్‌భాస్కర్‌రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఇక్కడ తహసీల్దారుగా పనిచేస్తున్న శివప్రసాద్ కడపకు బదిలీ కాగా ఆయన స్థానంలో అక్కడి నుంచి డి.ఉదయ్‌భాస్కర్‌రాజు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రవెన్యూ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



ఎంపీడీవో షాలేట్

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 5: ఎంపీడీవోగా షాలేట్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈమె నెల్లూరు జిల్లా చిట్టమూరు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

తహసీల్దారు బాధ్యతల స్వీకరణ



వరదయ్యపాళెం, ఫిబ్రవరి 5: వరదయ్యపాళెం తహసీల్దారుగా వై.ఉదయభారతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు ఆర్ఐ వేణుగోపాల్, సర్వేయర్ వెంకటరమణ ఇతర సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. సన్మానించారు.

దోచుకున్నవారు జైలుకు సిద్ధం కండి : టీడీపీ



మాట్లాడుతున్న బొజ్జల సుధీర్‌రెడ్డి

రేణిగుంట, ఫిబ్రవరి5: అధికారాన్ని అడ్డుపెట్టుకొని దోచుకున్నవారు జైలుకు వెళ్లడానికి సిద్ధంగా ఉండాలని టీడీపీ శ్రీకాళహస్తి నియోజక వర్గం ఇన్‌చార్జ్ బొజ్జల సుధీర్‌రెడ్డి హెచ్చరిం చారు. రేణిగుంట పాత చెక్‌పోస్టు సమీపంలోని వైకెన్వెన్షన్ హాలులో సోమవారం సాయంత్రం మండల స్థాయి జయహో బీసీ సభ ప్రభాకర్ ఆచారి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ బీసీలను గౌరవిస్తే వైసీపీ అణచివేసిందన్నారు. ఎమ్మెల్యే మధుసూదనరెడ్డి ప్రభుత్వ భూములను కబ్జాచేసి కోట్లు కొల్లగొట్టారని ఆరోపించారు. రేణిగుంట మండలంలో భూకబ్జాలు చేసిన వారిని వదలబోమని హెచ్చరించారు. టీడీపీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు జి.నరసింహ యాదవ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీసీలు టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ సభలో నాయకులు సి.సుబ్రమణ్యంరెడ్డి, చిన్నారెడ్డి, టి.మునిచంద్రారెడ్డి, దశరథాచారి, మనోహర్‌ఆచారి, గురవారెడ్డి, మహబుబ్‌బాషా, మునెయ్య, డి.పుష్పనాథ్, వెంకటరత్నం, బాలాజీ, నాథమునిరెడ్డి, వెంకటమునిరెడ్డి, ఏసయ్య, కె.మునస్వామి పాల్గొన్నారు.

ఎండీయూ సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తాం



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న గ్రామస్తులు

కేవీబీపురం, ఫిబ్రవరి5: మండలంలోని పెరిందేశం ఆదవరం, వేమలపూడి గ్రామాలకు చెందిన ఎండీయూ రేషన్ పంపిణీ విషయంలో తలెత్తిన వివాదాన్ని రెండు రోజుల్లో పరిష్కరిస్తామని తహసీల్దార్ శ్రీనివాస్‌నాయక్ చెప్పారు. గత ఏడాది ఆగస్టులో ఎండీయూ ఆపరేటర్ రాజీనామా చేశారు. దీంతో రెవిన్యూ వారు రేషన్ పంపిణీ బాధ్యతను ఆయా గ్రామాల వీఆర్‌ఓలకు అప్పగించారు. ఆ తరువాత పెరిందేశం గ్రామానికి చెందిన వ్యక్తికి రేషన్ పంపిణీ బాధ్యతలు ఇచ్చారు. అప్పటి నుంచి ఆయన పంపిణీ చేస్తున్నారు. అయితే ఎండీయూ వాహనం పాత ఆపరేటర్ వద్దే ఉంది. రెవెన్యూ వారు అడిగితే వాహనం కోసం ప్రభుత్వానికి చెల్లించిన నగదు ఇస్తేగానీ వాహనం ఇచ్చేది లేదని స్పష్టంచేశాడు. ఇలా వాహనం లేక రేషన్ పంపిణీ సక్రమంగా జరగలేదు. ఈ క్రమంలో సోమవారం గ్రామస్తులు సమస్యను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన పై విధంగా స్పందించారు.

డేటా ఎంట్రీపై ఉచిత శిక్షణ

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 5: ఐటీ డీఏ పరిధిలోని నెల్లూరు, చిత్తూరు ప్రకాశం, తిరుపతి, అన్నమయ్య, కడప జిల్లాలకు సంబంధించిన యువతకు చరిత కంప్యూటర్స్ ఆధ్వర్యంలో ఫీల్డ్ టెక్నీషియన్ కంప్యూటింగ్ అండ్ పెరిఫెరల్స్‌లో ఐహెచ్‌డీవో వారిచే డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆప రేటింగ్‌పై రెండు నెలల ఉచిత శిక్షణ ఉంటుంది. నెల్లూరులోని సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్తంగా ఐటీడీఏ ప్రాజెక్టు పరిధిలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వైటీసీ సెంటరు మేనేజరు బాలాజీ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వెంకటాచలం మండలం జాతీయ రహదారి పక్కన ఉన్న యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఉచిత వసతితో శిక్షణ ఉంటుంది. వివరాలకు 8187899877ను సంప్రదించాలని కోరారు.

తాగునీటి మోటారుకు మరమ్మతులు



బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 5: మండలంలోని పీవీకండ్రిగ గ్రామంలో తాగునీటి మోటారుకు మరమ్మ తులు చేయించారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో 'కిలో మీటరు నడిస్తేనే నీరు' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనానికి స్పందించిన సర్పంచ్ కోటమ్మ వెంటనే మోటారును బాగు చేయించారు. తాగు నీరు తక్షణం అందించే ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

విగ్రహ పంచనామా



అమ్మవారి విగ్రహం కింద వెలుగు చూసిన యంత్రం, నాణేలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 5: శ్రీకాళహస్తీశ్వ రాలయానికి అనుబంధంగా ఉన్న ఏడు గంగమ్మల అమ్మవారి విగ్రహానికి పంచనామా నిర్వహించారు. ఆలయ జీర్ణోద్ధరణ పనుల్లో భాగంగా సోమవారం అమ్మవారి మూలమూర్తిని ఆగమోక్తమంగా భద్రపరిచారు. ఈ సందర్భంగా అధికారుల బృందం విగ్రహ తొలగింపు ప్రక్రియను రికార్డు చేశారు. విగ్రహం కింద లభించిన వస్తువులను పంచనామా నివేదికలో నమోదు చేశారు. ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, డిప్యూటీ ఈవో వెంకటసుబ్బయ్య, వేద పండితులు పాల్గొన్నారు.

బీజేపీని ఆదరించండి: కోలా ఆనంద్



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కోలా ఆనందకుమార్

తొట్టంబేడు, ఫిబ్రవరి 5: బీజేపీని ఆదరిం చాలని ఆ పార్టీ శ్రీకాళ హస్తి నియోజక వర్గ కన్వీనర్ కోలా ఆనంద్ కోరారు. మండలం లోని చిన్నసింగ మాలలో వెలసిన వీరభద్ర స్వామికి పూజలు చేసి సోమ వారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. అనంతరం పొయ్యకొత్తూరు, సింగమాల గ్రామాలలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజక వర్గ కో-కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణయ్య, అయ్యప్ప, మునిరాజ, గోపాల్ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అధికారులు సహకరించండి : ఎంపీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

కేవీబీపురం, ఫిబ్రవరి5: మండల అభివృద్ధికి అధికారుల సహకరించాలని ఎంపీపీ మునిలక్ష్మి కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో ఆమె ఆధ్వర్యంలో సోమవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తుఫానులో దెబ్బతిన్న రైతులకు త్వరలోనే ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుందని వ్యవసాయాధికారి తెలియజేశారు. హార్టికల్చర్ అధికారి మాట్లాడుతూ రైతులు పామోలిన్ పంటను వేసుకోవాలని సూచించారు. అందుకు ప్రభుత్వం ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తుందని చెప్పారు. హౌసింగ్ అధికారి మాట్లాడుతు బిల్లులు చెల్లించకపోవడంతో నిర్మాణాలు ఆగిపోయాయని చెప్పారు. తుఫానుతో దెబ్బతిన్న రోడ్లు వంతెనలు బాగుచేయాలని సర్పంచులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కేవీ శివప్రసాద్, డీటీ మునిరత్నంరెడ్డి, ఈవోపీర్డీ విద్యాసాగర్, అన్నిశాఖల అధికారులు, జడ్పీటీసీ మునెమ్మ, నాయకులు కృష్ణయ్య, నందకుమార్, లాల్‌బాబు యాదవ్, మాధవిరెడ్డి, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని తరిమికొట్టడానికి జనం సిద్ధం : జనసేన



జనసైనికులతో కలిసి ప్రచారం చేస్తున్న వినుత

తొట్టంబేడు, ఫిబ్రవరి 5: వైసీపీని రాష్ట్రం నుంచి తరిమికొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని శ్రీకాళహస్తి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత అన్నారు. మండలంలోని రౌతుసూరమాల పంచాయతీలో 'జనసేన విజయ యాత్ర..ఏపీ నీడ్స్ పవన్' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఉమ్మడి మినీమ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో తొట్టంబేడు మండల ఇన్‌చార్జి పేట చంద్రశేఖర్, నాయకులు దండి రాఘవయ్య, కావలి శివకుమార్, గణేష్, లక్ష్మీనారాయణ, హరికృష్ణ, లక్ష్మి, శారద, రాకేష్, జనసైనికులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల అదృశ్యం.. కేసు నమోదు



నీలవేణి, వినోద్



గుణవతి

ఏర్పేడు, ఫిబ్రవరి 5: తల్లి ఇద్దరు బిడ్డలు అదృశ్యమన ఘటన ఏర్పేడు మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ శ్రీరామ శ్రీనివాసులు కథనం మేరకు.. గుండ్లకండ్రిగ గ్రామానికి చెందిన సుబ్రహ్మ ణ్యం భార్య గుణవతి(30). వీరికి కుమార్తె నీలవేణి(13), కుమారుడు వినోద్ (11) ఉన్నారు. గతనెల 20వ తేదీన కుమార్తెకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో భార్యా పిల్లలను చికిత్స నిమిత్తం రేణిగుం టలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి పంపించాడు. యథావిధిగా కూలి పనులకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చాడు. అప్పటికీ భార్యా బిడ్డలు రాలేదు. అప్పటినుంచి పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో సోమవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ నుంచి 500 మంది టీడీపీలోకి



టీడీపీలో చేరిన వారితో బొజ్జల సుధీర్‌రెడ్డి

ఏర్పేడు, ఫిబ్రవరి 5: 16 గ్రామాల నుంచి 500 మంది వైసీపీ వారు టీడీపీలో చేరారు. ఏర్పేడు మండలం పల్లం పంచాయతీ పల్లంపేటలో సోమవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా చెంచయ్యనాయుడు ఆధ్వర్యంలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో పార్టీలో చేరారు. శీకాళహస్తి మండలం ఈంద్రపల్లి నుంచి తోట రామయ్య, ప్రసాద్, వెలంపాడు నుంచి శ్రవణ్‌కుమార్, హరికృష్ణ, బ్రహ్మణపల్లి, పాపనపల్లి నుంచి చలపతి, శ్రీనివాసులు, కలవగుంట నుంచి వెంకట సుబ్బయ్య, వెంకటరమణ, కుంటిపూడి నుంచి విజయ్‌కుమార్, చెంచురామయ్య, రాజులపాళెం నుంచి సర్పంచ్ సుభాష్‌చంద్ర తన అనుచరులతో చేరారు. వీరికి బొజ్జల సుధీర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. అధికారంలోకి రాగానే రైతుల శ్రేయస్సు కోసం వరి ధాన్యాలను నిల్వ చేసుకునేందుకు గోదాము నిర్మిస్తామని రైతులకు సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఈశ్వరరెడ్డి, పాపిరెడ్డి, తులసీరామిరెడ్డి, ధనంజయుల నాయుడు, పొన్నారావు, చెంచయ్యనాయుడు, చంద్రశేఖర్‌నాయుడు, రవీంద్రనాథ్‌రెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.